E KABURU - Digital News Paper

E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 10-01-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక: 10|| పేజీలు–6 www.ekaburu.com




హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం..

» 3లో

తిలక్ లేకుంటే ఎవరు?

» 6లో



చైనా కంపెనీలపై ఆంక్షల ఎత్తివేత?

» 4లో



ది రాజాసాబ్'.. ప్రభాస్ ఫాంటసీ హారర్ కామెడీ ఎలా ఉంది?

» 5లో



ప్రభాస్ మూవీలో నటి-స్తారా ? యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్

» 5లో



## పంచాయితీ కాదు..

# పరిష్కారం కావాలి

» ఏపీ సహా సరిహద్దు రాష్ట్రాలతో మేం నీటి వివాదాలు కోరుకోవడం లేదు
» సీఎం రేవంత్‌రెడ్డి
» తెలంగాణ ప్రాజెక్టులకు మీరు అడ్డంకులు సృష్టించొద్దు
» మీరు సృష్టించే సమస్యల వల్ల అనుమతులు రావడం లేదు
» బ్యాంకు రుణాలే కాదు కేంద్ర ఆర్థిక సహకారం కూడా అందడం లేదు
» కూర్చొని మాట్లాడుకుందాం.. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిద్దాం
» ఏపీ ఒక అడుగు ముందుకు వేస్తే.. మేం 10 అడుగులు వేస్తాం
» జల వివాదాల ముసుగులో రాజకీయ లబ్ధి పొందే ఆలోచన లేదన్న సీఎం



(ఈ కబురు, హైదరాబాద్)

రంగారెడ్డి జిల్లా: 'నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ధి పొందే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదు. సరిహద్దు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలతో మేము ఎలాంటి వివాదాలను కోరుకోవడం లేదు. పరస్పర సహకారాన్ని కోరుకుంటున్నాం. తద్వారా అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాన్ని ఆశిస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన తెలంగాణ ప్రాజెక్టులకు పొరుగు రాష్ట్రాలు అడ్డంకులు సృష్టించొద్దు. మీరు సృష్టించే సమస్యల వల్ల తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావడం లేదు. బ్యాంకుల నుంచి రుణాలే కాదు.. కేంద్రం నుంచి ఆర్థిక సహకారం కూడా అందకుండా పోతోంది. ఏదైనా సమస్య ఉంటే కూర్చొని మాట్లాడుకుందాం. సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపిద్దాం. ఇందుకోసం ఏపీ ఒక అడుగు ముందుకేస్తే... పది అడుగులు ముందుకు వేసే తత్వం మాది. పక్క రాష్ట్ర ప్రజా ప్రతినిధులకు ఓ సూచన చేస్తున్నా. నీళ్ల వివాదాన్ని రాజకీయం చెయ్యొద్దు. రాజకీయాలకు అతీతంగా చర్చించి, సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపిద్దాం. ఇందుకోసం న్యాయ స్థానాలు, ఇతరుల సమక్షంలో కూర్చొనే కంటే మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడం ఉత్తమం. మీకు పంచాయితీలు కావాల్నా? నీళ్లు కావాల్నా? నేనైతే జలాలు కావాలనే కోరుకుంటా. వివాదాలు కావాల్నా? పరిష్కారం కావాల్నా? అంటే పరిష్కారమే కోరుకుంటా..'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగర శివార్లలోని రావిర్యాల ఫ్యాబ్‌సిటీలో 'సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్'తయారీ యూనిట్‌ను ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడారు.

తరువాయి 2లో




# తెలంగాణ నీటివాటాలను వదులుకోబోం

» కృష్ణా, గోదావరిలపై రాష్ట్రానికి నష్టం కలిగించే ప్రాజెక్టులను అడ్డుకుంటాం
» మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఈకబురు, : అశ్వారావుపేట, దమ్మపేట, కోదాడ: కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాలో చుక్క నీటినీ వదులుకోబోమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్ర నీటి హక్కుల కోసం పోరాడుతూనే.. కృష్ణాగోదావరి నదులపై చేపట్టిన ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో సీతారామ ఎత్తిపోతల పథకం నాలుగో పంప్‌హౌస్ వద్ద అధికారులతో శుక్రవారం ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కోదాడలోనూ ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల వాటా విషయంలో భారాస హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాబోయే ఆరు నెలల్లో ప్రాజెక్టులకు అవసరమైన భూములను సేకరించాలని అధికారులను ఆదేశించారు. గోదావరిపై తుమ్మిడిహెట్టి వద్ద రూ.38 వేల కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు పూర్తయితే గ్రావిటీ కెనాల్ ద్వారా 16 లక్షల ఎకరాలకు సాగునీరందేదని చెప్పారు

తరువాయి 3లో

## మోదీ ఫోన్ చేయలేదు..

# ట్రేడ్ డీల్ కుదరలేదు..



- అమెరికా వాణిజ్య శాఖ మంత్రి లుట్నిక్ వ్యాఖ్య
- భారత్‌కు మూడు వారాల సమయం ఇచ్చాం
- చర్చల ముగింపు దశలో ట్రంప్‌నకు కాల్ చేయాలని కోరాం
- కానీ ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేయలేదు
- అందుకే ఒప్పందం నిలిచిపోయిందని వెల్లడి
- లుట్నిక్ వ్యాఖ్యల్లో నిజం లేదు: భారత్

ఈ కబురు, న్యూయార్క్, జనవరి 9: భారత ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఫోన్ చేసి మాట్లాడకపోవటం వల్లే రెండు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరలేదని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. రెండు దేశాల ప్రతినిధుల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగిన తర్వాత ఒప్పందం కొలిక్కి వచ్చిందని, ఆ దశలో ఒప్పందం కుదరాలంటే ట్రంప్‌నకు మోదీ ఫోన్‌చేసి మాట్లాడాల్సి ఉండగా.. అది వారికి (భారత్‌కు) నచ్చకపోవటంతో ఒప్పందం ఆగిపోయిందని చెప్పారు. 'ఆల్ ఇన్ పాడ్‌కాస్ట్' సంస్థకు గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు వెల్లడించారు. .'భారత్ గురించి మీకో విషయం చెబుతాను. బ్రిటన్‌తో నేను మొదటి ఒప్పందం కుదిర్చాను. మీకు (బ్రిటన్‌కు) రెండు వారాల సమయమే ఉందని, ఆ తర్వాత రైలు వేరే స్టేషన్ (దేశానికి)కు వెళ్లిపోతుందని వారితో నేను చెప్పాను. ఎందుకంటే నేను ఒప్పందాలు చేసుకోవాల్సిన దేశాలు చాలా ఉన్నాయి. ఎవరు ముందుగా వస్తే వారికే మంచి

తరువాయి 2లో

# బెంగాల్‌లో ఐ-ప్యాక్ రచ్చ



- టీఎంసీ చీఫ్‌గా వెళ్లా.. ఐప్యాక్ పార్టీకి సలహా సంస్థ
- రాజకీయ కక్షతోనే ఈడీ దాడి: బెంగాల్ సీఎం మమత
- మమత, పోలీసులపై సీబీఐతో దర్యాప్తు జరపాలి
- కలకత్తా హైకోర్టులో ఈడీ రిట్ పిటిషన్
- ఈడీ మా సమాచారాన్ని దుర్వినియోగం చేయకుండా చూడండి.. హైకోర్టులో పిటిషన్ వేసిన టీఎంసీ
- కోర్టులో రసాభాస.. విచారణను 14కు వాయిదా

ఈకబురు, న్యూఢిల్లీ/కోల్‌కతా, జనవరి 9: రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలపై పశ్చిమబెంగాల్‌లో రచ్చ కొనసాగుతోంది. మమతకు వ్యతిరేకంగా ఈడీ, దర్యాప్తు సంస్థ సోదాలను సవాలు చేస్తూ టీఎంసీ.. కలకత్తా హైకోర్టును ఆశ్రయించాయి. ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించగా.. అక్కడా గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో అసహనం వ్యక్తం చేసిన న్యాయమూర్తి, పిటిషన్ల విచారణను ఈ నెల 14కు వాయిదా వేశారు. బొగ్గు అక్రమ రవా ణా కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఐప్యాక్ డైరెక్టర్ జైన్ ఇల్లు, సంస్థ కార్యాలయాల్లో గురువారం ఈడీ తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. ఈ తనిఖీలను వ్యతిరేకిస్తూ టీఎంసీ అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. శుక్రవారం దక్షిణ కోల్‌కతాలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందులో రాష్ట్ర మంత్రులు, టీఎంసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ ని 10 కి.మీ. మేర నిర్వహించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. టీఎంసీ అంతర్గత వ్యూహాలను చోరీ చేసేందుకు బీజేపీ సర్కారు ఈడీని వాడుకుంటోందని, రాజకీయ కక్షతోనే దాడి చేయిస్తోందని ఆరోపించారు. ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో తాను ఐప్యాక్ కార్యాలయానికి, ప్రతీక్ జైన్ ఇంటికి వెళ్లడాన్ని సమర్థించుకున్నారు. "నేను నిన్న ఏం చేసినా అది టీఎంసీ అధ్యక్షురాలిగానే చేశా.

తరువాయి 2లో


## ఇక ఎవడూ కబ్జా చేయలేడు!



» మీ భూమిమీ హక్కు.. బ్లాక్ చైన్ టెక్నాలజీతో పాస్ పుస్తకాలు
» ఏడాదిలోగా ప్రతి నెలా 29 మధ్య పంపిణీ కార్యక్రమం
» కూటమి రాకుండా ఉంటే.. మీ భూములు గోవిందా అయ్యేవి
» ఆ నరకాసురుడిని మళ్లీ రానివ్వొద్దు
» సంక్రాంతికి కోడిపందేలు చూద్దాం
» కానీ జూదాలు వద్దు: చంద్రబాబు
» తూర్పుగోదావరి రాయవరంలో రైతులకు పాస్‌పుస్తకాలు అందజేత

ఈ-కబురు, రాజమహేంద్రవరం: 'ఇక మీ భూమిని ఎవడూ కబ్జా చేయలేడు. మీ భూమి-మీ హక్కు. అత్యాధునికమైన బ్లాక్ చైన్ టెక్నాలజీతో పాస్‌పుస్తకాలు రూపొందిస్తున్నాం. ఒక తప్పు కూడా లేకుండా మీకు అందిస్తాం' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

తరువాయి 2లో



ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వ తీరు మారదా?

» 2లో



ప్రభుత్వ ఉద్యోగులం దరికీ రూ.కోటి ప్రమాద బీమా

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

తరువాయి 3లో



కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోంది: కేటీఆర్

తరువాయి 2లో



అంతర్జాతీయ చట్టాలను పట్టించుకోను

తరువాయి 3లో

### మోదీ ఫోన్ చేయలేదు..

# ట్రేడ్ డీల్ కుదరలేదు..

మొదటి పేజీ తరువాయి

నిజానికి అది స్పష్టంగా ట్రంప్ డీల్. ఆయనే ఈ చర్చలు మొత్తాన్ని నడిపించారు. దీంతో చివరగా ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేసి మాట్లాడితే ఒప్పందం ఖరారవుతుందని నేను వారితో చెప్పాను. కానీ మోదీ కాల్ చేయలేదు. ఆ తర్వాత మేము ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, వియత్నాంలతో ఒప్పందాలు చేసుకున్నాం. నిజానికి వీటికంటే ముందు భారత్‌తోనే ఒప్పందం జరగాల్సి ఉంది. మేము ఇచ్చిన గడువు ముగిసిన తర్వాత భారత అధికారులు వచ్చి ఒప్పందానికి సిద్ధమని చెప్పారు. కానీ, ఎంత రేటుకు అని నేను అడిగా. త్రాసులో భారత్ సరైన వైపున ఉండలేదు. అందుకే వాణిజ్య ఒప్పందం కుదరలేదు' అని లుట్నిక్ వివరించారు.

కాగా, లుట్నిక్ వాఖ్యలను భారత్ ఖండించింది. ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేయకపోవటం వల్లనే భారత్,అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరలేదన్నది వాస్తవం కాదని విదేశాంగశాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి 13వ తేదీ నుంచి రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు పలు దఫాలుగా జరిగాయని, కొన్ని విషయాల్లో అంగీకారం కుదరకపోవటంతో ఒప్పందం సాధ్యం కాలేదని వెల్లడించారు



# పంచాయితీ కాదు.. పరిష్కారం కావాలి

మరిన్ని కనుగొనండి
జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్

**పక్క రాష్ట్రంతో సయోధ్య అవసరం**

'కృష్ణా బేసిన్‌లో పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతలతో పాటు, డిండి, ఎస్ఎల్‌బీసీ, బీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులు ఉమ్మడి రాష్ట్రంలోనే మంజూరయ్యాయి. కానీ ఏపీ అభ్యంతరాల వల్ల వాటికి పర్యావరణ, సీడబ్ల్యూసీ అనుమతులు, బ్యాంకులు, కేంద్రం నుంచి నిధులు రావడం లేదు. ఇది రాష్ట్రానికి భారంగా పరిణమిస్తోంది. ఇక్కడ డేటా సెంటర్లు పెట్టాలంటే విద్యుత్‌తో పాటు నీరు కూడా కీలకం. కృష్ణానది నుంచి ఇక్కడికి నీటిని తరలించాలన్నా..యాదాద్రి నుంచి కరెంట్ తరలించాలన్నా.. పరస్పర సహకారం అవసరం. తెలంగాణకు పోర్టు రావాలన్నా..ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వేయాలన్నా పక్క రాష్ట్రంతో సయోధ్య, సహకారం అవసరం. అలాగే అమరావతి అభివృద్ధి కావాలంటే హైదరాబాద్ సహకారం కూడా ఉండాలి..'అని సీఎం అన్నారు.

**ప్రపంచ దేశాలతోనే పోటీ**

'రాష్ట్రంలో పారిశ్రామిక, ఇంధన, పర్యాటక, ఎండోమెంట్, మెడికల్ పాలసీలను తీసుకొచ్చాం. త్వరలో ఎడ్యుకేషన్ పాలసీ కూడా తీసుకురానున్నాం. ఐటీ, ఫార్మా, డేటా సెంటర్ల రంగంలో రాష్ట్రం పోటీ పడుతోంది. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి అనుగుణంగా పాలసీ డాక్యుమెంట్‌ను రూపొందించాం. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుర్గాంవ్‌తో తెలంగాణ పోటీ పడుతోందనే చర్చ పదేపదే జరుగుతోంది. దీనికి ఫుల్‌స్టాఫ్ పెట్టి జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడాలని ఆలోచన చేస్తున్నాం. యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు ప్రారంభించే పరిశ్రమలకు ప్రభుత్వం మద్దతు ఇస్తుంది. సహాయ సహకారాలు అందజేసి ప్రోత్సహిస్తుంది. దేశ బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. నాలుగు కోవిడ్ వ్యాక్సిన్లలో మూడు ఇక్కడి నుంచే వచ్చాయి. సిలికాన్ వ్యాలిలోని ఐటీ కంపెనీలకు సీఈఓలుగా వ్యవహరిస్తున్న వారు హైదరాబాద్‌లోనే చదువుకున్నారు. సక్సెస్ స్టోరీలు సృష్టించాలి. ప్రభుత్వం ఇప్పటికే 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది. మరో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వీరికి ప్రైవేటు రంగంలోనూ అవకాశం కల్పించాలి. ఐఎస్ఎస్‌ల కన్నా ప్రైవేటు రంగంలోనే ప్యాకేజీలు అధికంగా ఉన్నాయి. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ప్రైవేటు రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకోవాలి..'అని ముఖ్యమంత్రి సూచించారు.

మరిన్ని కనుగొనండి
జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్

**ఉపాధి అవకాశాలకు పెద్దపీట:.శ్రీధర్‌రాబు**

మెడికేర్, ఫార్మా, లైఫ్‌సైన్స్‌కు సంబంధించిన ఎకోసిస్టమ్‌లో నాలుగు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ప్రధానంగా ఉంటుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. పరిశ్రమలకు అనుగుణంగా పాలసీలు ఉండాలని భావించి, ఆ కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. విదేశీ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించామని, ఇక్కడ పెట్టుబడులు పెట్టి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**ఒడిఎన్ మాల్‌ను ప్రారంభించిన సీఎం**

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ స్థాయి షాపింగ్, డైనింగ్, వినోదాల సమ్మేళనంగా నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన అల్ట్రా ప్రీమియం ఒడిఎన్ మాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, అజహరుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఓడిఎన్ మాల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోంది: కేటీఆర్



ఈ కబురు, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఉర్దూ వర్సిటీ భూములకు సంబంధించి ప్రభుత్వ నోటీసుల నేపథ్యంలో నందినగర్‌లో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. "ప్రభుత్వం భూములు లాక్కోవడం ఇదే మొదటిసారి కాదు. జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నుంచి 100 ఎకరాలు తీసుకున్నారు. విద్యార్థులు పోరాడినా ఆందోళనను అణచివేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనూ ఇదే విధమైన భూదందా చేశారు. అక్కడ 400 ఎకరాలు తీసుకునేందుకు యత్నించారు. సుప్రీంకోర్టు సీజే సుమోటోగా తీసుకుని ఆదేశాలు ఇచ్చేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు"అని కేటీఆర్ అన్నారు.

# బెంగాల్‌లో ఐ-ప్యాక్ రచ్చ

మొదటి పేజీ తరువాయి

సీఎంగా కాదు. నేనేమీ చట్టవిరుద్ధంగా ప్రవర్తించలేదు'' అని మమత స్పష్టం చేశారు. ఐప్యాక్ తమ పార్టీకి రాజకీయ సలహా సంస్థ అని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు అన్ని సంస్థలనూ తన గుప్పిట్లో పెట్టుకుందని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర, హరియాణా, బిహార్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ బలవంతంగా అధికారాన్ని చేజిక్కించుకుందని ఆరోపించారు. బెంగాల్‌లో కూడా అలాగే గద్దెనెక్కాలని చూస్తున్నారా? అని మమత నిలదీశారు. ఈసీ సాయంతో మహారాష్ట్ర ఎన్నికల్లో గెలిచారని.. ఇప్పుడు ఓటర్ల జాబితా సవరణ పేరుతో నిజమైన ఓటర్లను కూడా తొలగించి బెంగాల్‌లోనూ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు.

**మమతపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి: ఈడీ**

మనీలాండరింగ్ కేసులో ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు జరుపుతుండగా.. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వచ్చి కీలక ఆధారాలను తీసుకెళ్లిపోయారని, ఆమెపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఈడీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. తమ విధులకు ఆటంకం కలిగించిన సీఎం మమత, సీనియర్ పోలీసు అధికారులు, ఇతరులపై సీబీఐతో విచారణ జరిపించాలని అభ్యర్థిస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. సోదాలు చేసిన ప్రాంతాల నుంచి తాము సేకరించిన ఆధారాలను మమత, ఆమె అనుచరులు బలవంతంగా తీసుకెళ్లిపోయారని.. వాటిని తక్షణమే సీజ్ చేసి తమకు అప్పగించేలా చూడాలని ఈడీ కోరింది. కాగా, టీఎంసీ కూడా ఈడీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించింది. ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాల సందర్భంగా సేకరించిన సమాచారాన్ని దుర్వినియోగం చేయకుండా ఈడీని అడ్డుకోవాలని కోరుతూ రిట్ పిటిషన్ వేసింది. ఈడీ, టీఎంసీ పిటిషన్ల విచారణ సందర్భంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ పిటిషన్లు జస్టిస్ సువ్ర ఘోష్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. అయితే, కోర్టు గది తీవ్ర రసాభాసగా మారిపోవడంతో జస్టిస్ ఘోష్ విచారణను ఈ నెల 14కు వాయిదా వేశారు. పిటిషన్లకు సంబంధం లేని న్యాయవాదులు కూడా పదేపదే విజ్ఞప్తులు చేస్తూ గందరగోళం సృష్టించడంతో ఆమె తన సీటు నుంచి లేచి వెళ్లిపోయారు. కాగా, తమ పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని ఈడీ తరఫు న్యాయవాది హైకోర్టు తాత్కాలిక సీజే జస్టిస్ సుజోయ్ పాల్‌ను కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. జస్టిస్ ఘోష్ ఆదేశాల్లో తాను జోక్యం చేసుకోలేనని తేల్చిచెప్పారు. మరోవైపు టీఎంసీ అధ్యక్షురాలి హోదాలో మమత శుక్రవారం ఈడీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోల్‌కతా, బిధాన్‌నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ఈ డ్రామాలు మమతకు అలవాటే: బీజేపీ**

ఈడీ తనిఖీల సమయంలో సీఎం మమత ప్రవర్తించిన తీరును బీజేపీ తప్పుపట్టింది. తనిఖీలు చేస్తున్న ఈడీ అధికారుల నుంచి పత్రాలను లాక్కెళ్లిపోవడం చూస్తుంటే ఆమెపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ప్రతి ఎన్నిక ముందు ఆమె ఇలాంటి డ్రామాలే చేస్తుంటారని ఎద్దేవా చేశారు. కోల్‌కతాలో ర్యాలీ కూడా డ్రామా అని అన్నారు.

**ఢిల్లీలో టీఎంసీ ఎంపీల నిరసన**

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు శుక్రవారం ఢిల్లీలోని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మహువా మొయిత్రా, శతాబ్ది రాయ్, కీర్తి ఆజాద్, డెరెక్ ఓబ్రెయిన్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు. కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలకు వ్యతిరేకంగా ఎంపీలు, నేతలు నినాదాలు చేశారు. రాజకీయ కక్షతోనే ఈడీని ఆయుధంగా ఉయోగిస్తున్నారంటూ అమిత్ షాపై విమర్శలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎంపీలు నినాదాలు చేయడంతో పోలీసులు వారిని అక్కడి నుంచి బలవంతంగా లాక్కెళ్లారు. పోలీసుల తీరును ఎంపీలు ఖండించారు.



## ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వ తీరు మారదా?

హైదరాబాద్: కొత్త సినిమా వస్తే టిక్కెట్ ధరల పెంపు వ్యవహారంలో ప్రతిసారి చివరి క్షణంలో, సెలవుల ముందు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుందని, ఎన్నిసార్లు చెప్పినా తీరు మారదా అంటూ హైకోర్టు శుక్రవారం అసహనం వ్యక్తం చేసింది. టిక్కెట్ ధరలను పెంచాలనుకుంటే నిబంధనల ప్రకారం చేసుకోవచ్చని, అంతేగానీ చట్టవిరుద్ధంగా మెమోల రూపంలో పెంచుకోవడానికి అనుమతించలేమంది. 'రాజాసాబ్' సినిమా టిక్కెట్ ధరలను వారంపాటు పెంచుకోవడానికి ఇచ్చిన మెమోను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. భవిష్యత్తులో వచ్చే కొత్త సినిమాలకు టిక్కెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిస్తూ ఎలాంటి మెమోలు జారీ చేయడానికి వీల్లేదని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత మెమో ద్వారా శుక్రవారం విక్రయించిన టిక్కెట్‌లను యథాతథంగా ఉంచవచ్చని, శనివారం నుంచి పాత ధరలనే వసూలు చేయాలని స్పష్టం చేసింది. 'రాజాసాబ్' సినిమాకు జనవరి 18వరకు టిక్కెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిస్తూ ఇచ్చిన మెమోను సవాలు చేస్తూ దాఖలైన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం మెమోలు జారీ చేస్తోందన్నారు. అధిక బడ్జెట్ అని చెప్పడం తప్ప దానికి సంబంధించి ఆడిటింగ్ నివేదికలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. నిర్మాతలు, బుక్‌మై షో తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ భారీ బడ్జెట్‌తో



సినిమాలు తీసినపుడు టిక్కెట్ ధరలను పెంచుకోవడానికి ప్రభుత్వ అనుమతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే 3 లక్షల టిక్కెట్‌లు విక్రయించామని, ఆ సొమ్మును వెనక్కి ఇవ్వాలంటే ప్రేక్షకులు థియేటర్లను ధ్వంసం చేసే అవకాశం ఉందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి టిక్కెట్ ధరల పెంపునకు సంబంధించి జారీ అయిన జీవో 120 ప్రకారమే నడుచుకోవాలని ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పును ప్రభుత్వం, డివిజన్ బెంచ్ కూడా అమలు చేయాల్సిందేనని పేర్కొంది. జీవో 120పై సీజే ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులపై రివ్యూ వేసి, లేదంటే సుప్రీంకోర్టును ఆశ్రయించి వాటిని సవరించుకోవాలని, లేదంటే చట్టప్రకారం కొత్త జీవో జారీ చేసి టిక్కెట్ ధరలను ఇష్టానుసారం పెంచుకున్నా తమకు అభ్యంతరం లేదంది. ఇకపై సినిమాలకు అధిక ధరలు వసూలు చేయడానికి ఎలాంటి అనుమతులు ఉండవని సాక్షాత్తు మంత్రి ప్రకటించారని అయినా మళ్లీ ఎందుకు ఉత్తర్వులు ఇచ్చారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. ప్రస్తుత మెమో జారీలో హైకోర్టు ఉత్తర్వులతోపాటు సినిమాటోగ్రఫీ నిబంధనల ఉల్లంఘన జరిగిందన్నారు. 'రాజాసాబ్' టిక్కెట్ ధరల పెంపుపై జారీ చేసిన మెమోను సస్పెండ్ చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

## ఇక ఎవడూ కబ్జా చేయలేడు!

మొదటి పేజీ తరువాయి



తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం పరిధిలోని రాయవరంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'మీ భూమిమీహక్కు' ప్రజావేదిక సభలో సీఎం ప్రసంగించారు. 'తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాకుంటే మీ భూములు గోవిందా.. గోవిందా అయ్యేవి.. అవునా? కాదా?.. అవునంటే చేతులు పైకెత్తండి..' అని ఆయన అనగానే సభలో అందరూ చేతులు పైకెత్తారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. 'ఇదీ ఆనాటి పరిస్థితి. ఇవాళ చరిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. ఇది పవిత్ర కార్యక్రమం. మనందరికీ భూమి అనేది ఒక అటాచ్‌మెంట్. మన తల్లిదండ్రులు, పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తోంది. ప్రాణంపోయినా ఒప్పుకుంటాడేమో కానీ రైతు భూమిని వదులుకోవడానికి ఇష్టపడడు. కరోనా సమయంలో అందరికీ హాలిడే.. రైతుకు మాత్రం లేదు. ఆ సమయంలో కూడా వ్యవసాయం చేసి అందరికీ అన్నంపెట్టిన రైతును మరచిపోకూడదు. అలాంటి భూమిని గత వైసీపీ ప్రభుత్వం, అప్పటి సీఎం జగన్.. సమస్యగా మార్చేశారు. అతలాకుతలం చేశారు' అని మండిపడ్డారు. ఇంకా ఏం చెప్పారంటే..

**మీ భూములపై పెత్తనం చేయాలని..**

సున్నితమైన సమస్యతో తలగోక్కుంటే మసైపోతారని నాటి సీఎంకు చెప్పాను. కానీ లెక్కపెట్టలేదు. అహంకారం కళ్లపైకెక్కింది. నీ తల్లో, తండ్రో, తాతముత్తాతలో ఇచ్చిన ఆస్తికి ఆయన ఫొటో వేసుకున్నాడు. మీ భూమి సరిహద్దుల్లో సర్వే రాళ్లు పెట్టి, వాటిపై తన బొమ్మ పెట్టుకున్నాడు. మరోపక్క మీభూమిని కంప్యూటరీకరించి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చాడు. ఆ చట్టానికి అధిపతులుగా ప్రైవేటు వాళ్లను.. తన మనుషులను పెట్టుకున్నాడు. మీ భూమిమీహక్కు. వేరేవాళ్ల ఫొటో ఉండడానికి వీల్లేదని.. రాజముద్రతో మళ్లీ మీకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తానని నేనా రోజు హామీ ఇచ్చాను. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తానని చెప్పాను. రెండో సంతకం దానిపైనే పెట్టాను. వైసీపీ ప్రభుత్వం 22ఏ తీసుకొచ్చి.. మీ భూమిని ఏ రౌడీషీటర్ అడిగినా, రాజకీయ నాయకుడు అడిగినా ఇవ్వకపోతే దాన్ని నిషేధ జాబితాలోకి మార్చేసింది. ఇవాళ 6,680 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. 4,784 గ్రామాల్లో పాసు పుస్తకాలు ముద్రించాం. 22.33 లక్షల పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్రం మొత్తమ్మీద లక్షా 18 వేల పాసు పుస్తకాల్లో లోపాలున్నాయి. అవన్నీ సరిచేస్తున్నాం. సంవత్సరం కాలపరిమితి పెట్టుకున్నాను.. ప్రతినెలా 1న పింఛన్లు ఇవ్వాలి. 2 నుంచి 9 వరకూ పాసుపుస్తకాల పంపిణీ. ఒక తప్పు కూడా లేకుండా ఇవ్వాలి.

**ఐదేళ్లకోసారి మార్చేద్దామనే ఆలోచన వద్దు**

ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని మార్చేద్దామని ఆలోచన మంచిదికాదు. సుస్థిర పాలనతోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఇక విద్యుత్ చార్జీలు పెరగవు. గత ప్రభుత్వ చార్జీలు పెంచేసి అనేక రకాలుగా ప్రజలను ఇబ్బంది పెట్టింది. వృథాగా పోయే నీటి కోసం తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు వద్దు.


**ప్రభల తీర్థాలకు రాష్ట్ర గుర్తింపు**

గోదావరి జిల్లాల్లో.. ముఖ్యంగా కోనసీమలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసే ప్రభల తీర్థాలకు రాష్ట్ర పండుగ గుర్తింపు ఇచ్చాం. జగన్నతోట ప్రభల శివుని రూపం. 470 ఏళ్లనాటి వారసత్వ ఆధ్యాత్మిక సాంస్కృతిక ఉద్యమానికి రక్షణ ఇవ్వనున్నాం. సంక్రాంతికి గోదావరి జిల్లాలో కోడిపందేలు గుర్తుకు వస్తాయి. జూదాలు వద్దు.. కానీ వారసత్వాన్ని పరిరక్షించుకోవడానికి కోడిపందాలు చూద్దాం. ప్రజలందరికీ ఒక విజ్ఞప్తి. చరిత్రలో ఒక నరకాసురుడిని వధిస్తే ఏటా దీపావళి చేసుకుంటున్నాం. ఇవాళ మళ్లీ నరకాసురుడి పాలన రాకూడదు. 'నా అదృష్టం. గోదావరి పుష్కరాలు మూడోసారి నిర్వహించే అవకాశం వచ్చింది. 2027 మార్చి లోపు పోలవరం పూర్తి చేసి ప్రజలకు అంకితం ఇస్తాం. సొంత బాబాయిని హత్య చేసి నామీదకు తోసినవాడి వ్యవహారం ఎలా ఉంటుందో తెలుసుకుని వైసీపీపట్ల అప్రమత్తంగా ఉన్నాను. డేగకన్ను వేశాను. వాళ్ల పాపాలు కడిగేస్తాం.

**12న నారావారిపల్లికి సీఎం**

సీఎం చంద్రబాబు సోమవారం తిరుపతి జిల్లాకు రానున్నారు. సూళ్లూరుపేటలో సోమవారం రాష్ట్రస్థాయి ఫ్లెమింగో ఫెస్టివల్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరవుతారు. అనంతరం రోడ్డు మార్గాన స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లి చేరుకుంటారు. 13, 14, 15 తేదీల్లో సంక్రాంతికి ఎప్పటిలాగే కుటుంబసభ్యులతో గడుపుతారు. 14న స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్టులో భాగంగా అమలవుతున్న పలు కార్యక్రమాలను సమీక్షిస్తారు. 15న తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు. అదే రోజు ఉండవల్లికి తిరుగు ప్రయాణమవుతారు.

## ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.కోటి ప్రమాద బీమా



రాష్ట్రంలోని రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ చేర్చే ప్రభుత్వ ఉద్యోగులను తమ కుటుంబ సభ్యులుగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం భావిస్తుందని చెప్పారు. రూ.1.02 కోట్ల ప్రమాద బీమాకు సంబంధించిన ప్రక్రియను అందుబాటులోకి తెచ్చేందుకు బ్యాంకర్లతో సంప్రదింపులు ముగిసినట్టు భట్టి వెల్లడించారు.ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను ప్రతినెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నామన్నారు. ఇప్పటికే సింగరేణి, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, జెన్‌కో పరిధిలోని ఉద్యోగులందరికీ కోటికి పైగా ప్రమాద బీమాను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 5.14 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

# తెలంగాణ నీటివాటాలను వదులుకోబోం



. భారాస ప్రభుత్వం డిజైన్ మార్చి మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మిస్తే అది కూలిపోయిందని విమర్శించారు. రూ.లక్ష కోట్లకుపైగా వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం.. కమీషన్ల కక్కుర్తితో కూలిపోయిందని ధ్వజమెత్తారు. రాబోయే మూడేళ్లలో కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామన్నారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న పోలవరంనల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్ అనుమతించలేదని డిసెంబరు 4న కేంద్రమే లేఖ రాసిందన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని చెప్పారు. తెలంగాణకు నష్టం కలిగించే ప్రాజెక్టుల విషయంలో సుప్రీంకోర్టులో పక్కాగా వాదనలు వినిపించి వాటిని ఆపేలా చూస్తామన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. జూన్ నాటికి సీతారామ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరందిస్తామని తెలిపారు.

రైతుల అభ్యున్నతి కోసం పథకాలు...

వ్యవసాయ రంగం ద్వారా 2047 నాటికి 400 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం 'వ్యవసాయ యాంత్రీకరణ', 'ప్రకృతి వ్యవసాయం' పథకాలను మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. చిన్న, సన్నకారు రైతుల అభ్యున్నతి కోసం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. సుమారు 1.31 లక్షల మంది రైతులకు రూ.101 కోట్లతో పరికరాలు అందించనున్నట్లు వివరించారు. పెండింగ్‌లో ఉన్న బోనస్ సొమ్మును త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఉత్తమ్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# 'హేజల్‌నట్'తో ఉక్రెయిన్‌లో అలజడి.. అత్యాధునిక క్షిపణిని ప్రయోగించిన రష్యా



మాస్కో: రష్యాఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రమయ్యాయి. ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు పాల్పడినట్లు క్రెమ్లిన్ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా మాస్కో తాజాగా ఉక్రెయిన్ (Ukraine) పై అత్యాధునిక ఒరెష్నిక్ క్షిపణితో విరుచుకుపడింది. ధ్వని కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించగల ఈ క్షిపణిని (Oreshnik Ballistic Missile) గురువారం అర్ధరాత్రి పశ్చిమ లివివ్ ప్రాంతంపై ప్రయోగించింది.

పుతిన్ నివాసంపై దాడికి ప్రతీకారంగానే ఈ క్షిపణిని ప్రయోగించినట్లు రష్యా (Russia) రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ క్షిపణితో కీలక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అయితే కచ్చితంగా ఏ ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ మిస్సైల్‌ను ప్రయోగించిందన్న వివరాలను మాస్కో వెల్లడించలేదు కానీ.. ఉక్రెయిన్ భూగర్భ సహజ వాయువు నిల్వలపై ఈ దాడి జరిగినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలపై ఉక్రెయిన్ అధికారులు స్పందించారు. రష్యా జరిపిన దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. 22 మంది గాయపడినట్లు తెలిపారు. ఒరెష్నిక్‌తో పాటు మొత్తం 36 క్షిపణులు, 242 డ్రోన్లను రష్యా ప్రయోగించినట్లు కీవ్ ఆరోపించింది. నాటో సరిహద్దుకు సమీపంలో ఒరెష్నిక్ పడిందని, ఐరోపా భద్రతకు ఇది పెనుముప్పు అని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి అన్నారు.

ఐరోపా మొత్తాన్ని టార్గెట్ చేసేలా..

రష్యా అత్యాధునిక క్షిపణుల్లో ఒరెష్నిక్ ఒకటి. రష్యన్ భాషలో దీనర్థం హేజల్‌నట్ చెట్టు. సాధారణంగా మాస్కో అభివృద్ధి చేసే క్షిపణులకు చెట్ల పేర్లను పెట్టడం ఆనవాయితీ. ఒరెష్నిక్ మధ్య స్థాయి క్షిపణి. ఇది గంటకు 13,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అంటే ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా దూసుకెళ్తుంది. యూరప్‌లోని అన్ని దేశాలు ఈ మిస్సైల్ పరిధిలోకి వస్తాయని రష్యా మిస్సైల్ ఫోర్సెస్ చీఫ్ వెల్లడించారు. ఇప్పటివరకు ఈ క్షిపణిని అడ్డుకునే సామర్థ్యం గల ఆయుధమేదీ లేదని పేర్కొన్నారు. తొలిసారిగా ఈ క్షిపణిని 2024 నవంబరులో ఓ ఉక్రెయిన్ ఫ్యాక్టరీ మీద ప్రయోగించారు. అప్పట్లో అది ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. ఇటీవలే దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు. రష్యా మిత్రదేశమైన బెలారస్‌కు ఈ మిస్సైల్‌ను తరలించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ క్షిపణి అణు బాంబులతో పాటు అనేక వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు.

# నిరుద్యోగులపై భారాస మొసలి కన్నీరు



సంగారెడ్డి: నిరుద్యోగుల గురించి భారాస నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేయడంతోపాటు సంగారెడ్డిలోని ఐఐటీహెచ్‌లో టెక్నోఫెస్ట్‌ను ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ''పదేళ్ల కాలంలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి, నిరుద్యోగుల జీవితాలను అంధకారం చేసిన మీరు.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తుంటే యావత్తు తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. అశోక్‌నగర్ లైబ్రరీ సాక్షిగా పదేళ్లు నిరుద్యోగులను వంచించిన చరిత్ర మీది కాదా? నాడు నోటిఫికేషన్ల పేరుతో ఊరించి, పరీక్షల పేరుతో వేధించింది మీరు కాదా? అధికారం పోగానే మీకు నిరుద్యోగులు గుర్తొచ్చారా? రాజకీయం కోసం బురద జల్లడం మానేసి, మేమిచ్చిన నియామక పత్రాలను ఒకసారి లెక్కపెట్టుకోండి. అప్పుడు ఎవరు న్యాయం చేశారో? ఎవరు మోసం చేశారో? తెలుస్తుంది. టీజీపీఎస్సీ ప్రశ్నపత్రాలను బజార్లో అమ్ముతుంటే కళ్లు అప్పగించి చూసింది మీరు కాదా? గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థత మీది. రెండుసార్లు ప్రిలిమ్స్ రద్దు కావడం వల్ల లక్షల మంది నిరుద్యోగులు మానసిక వేదనకు గురయ్యారు. అప్పుడెందుకో మాట్లాడలేదు'' అని భారాస నేతలను నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీని ఒక పవిత్ర కార్యంగా తీసుకున్నామని.. ఎక్కడా ఎలాంటి లీకేజీలకు తావు లేకుండా, అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి ఇప్పటికే 70 వేల మందికి ప్రభుత్వోద్యోగాలు కల్పించి 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వాములుగా చేశామని మంత్రి పేర్కొన్నారు.

నిరుద్యోగులను ఉద్దేశిస్తూ.. ''ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీచేయడంతో పాటు, ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శాసనమండలి ద్వారా వెల్లడించా. నైపుణ్యమున్న విద్యార్థులకు ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పా. ఈ మాటలను కొందరు కావాలనే పనిగట్టుకుని వక్రీకరిస్తున్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం మిమ్మల్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ భవిష్యత్తు మీరే. జాబ్ క్యాలెండర్ విషయంలో మా ప్రభుత్వం స్పష్టతతో ఉంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. ఈ విషయంలో శాస్త్రీయబద్ధంగా ముందుకు వెళ్లాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం'' అని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# అంతర్జాతీయ చట్టాలను పట్టించుకోను



**వాషింగ్టన్: అంతర్జాతీయ చట్టాలను తాను పట్టించుకోనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. మనస్సాక్షి ప్రకారమే తాను నిర్ణయాలు తీసుకుంటానని తెలిపారు. తాను అధికారంలో ఉన్నంత వరకు తైవాన్‌పై చైనా ఎలాంటి చర్యలకు దిగబోదని అన్నారు. 'నా మనసు మాత్రమే నన్ను ఆపగలదు. నాకు ఎలాంటి అంతర్జాతీయ చట్టాలు అవసరంలేదు. నేను ఎవరినీ ఇబ్బంది పెట్టాలని అనుకోవట్లేదు. తైవాన్ అంశంపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఏం చేయబోతున్నారో ఆయనకే తెలుసు. కానీ, ఒకటి మాత్రం గట్టిగా చెప్పాను. తైవాన్‌పై చర్యలకు పాల్పడితే నేను సంతోషించనని చెప్పాను. నాకు తెలిసి ఆయన అలాంటి పనులు చేయడు. అమెరికాకు మరో అధ్యక్షుడు వచ్చాక తైవాన్‌పై నిర్ణయం తీసుకుంటారేమో. నేను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం జిన్‌పింగ్ ఈ పని చేస్తారని నేను అనుకోవట్లేదు" అని ట్రంప్ పేర్కొన్నారు. నాటో కూటమి రక్షణ లేదా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడం ఈ రెండింట్లో ఏది ప్రాధాన్య అంశమని ప్రశ్నించగా, అది తమ ఛాయిస్ అని చెప్పారు.**

# ముందు మీ దేశంపై దృష్టి పెట్టండి: ట్రంప్ తీరుపై ఖమేనీ



ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చోటుచేసుకుంటున్న అల్లర్లపై ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. తమ దేశంలో ఆందోళనకారులను హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తుల చేతుల్లో కిరాయి సైనికుల్లా వ్యవహరించే వారిని సహించే ప్రసక్తే లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశిస్తూ.. ఇతర దేశాలకు చెప్పే ముందు సొంత దేశంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇతర దేశాధ్యక్షుడిని సంతోష పెట్టేందుకు సొంత వీధులను నాశనం చేసుకుంటున్నారంటూ ఆందోళనకారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రవాసంలో తలదాచుకున్న యువరాజు రెజా పహ్లావి (గతంలో అమెరికా మద్దతుతో దేశాన్ని పాలించిన 'షా' వారసుడు) ఇచ్చిన పిలుపు మేరకు ఇరాన్‌లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. గురువారం మొదలైన ఈ నిరసనలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను ప్రభుత్వం నిలిపేసినప్పటికీ ఆందోళనకారులు పెద్ద ఎత్తున పాల్గొనడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే స్పందించిన సుప్రీం లీడర్.. యువత ఏకతాటిపై ఉండాలని, దేశం ఐకమత్యంగా ఉన్నప్పుడే ఎలాంటి శత్రువునైనా ఎదుర్కోవచ్చన్నారు.

# మరో వెనెజువెలా నౌక స్వాధీనం



వాషింగ్టన్: కరీబియన్ సముద్రంలో మరో వెనెజువెలా నౌకను అమెరికా స్వాధీనం చేసుకుంది. శుక్రవారం అమెరికా బలగాలు ఈ నౌకపై దిగి సోదాలు జరిపి సీజ్ చేశాయి. దీంతో ఇప్పటిదాకా 5 వెనెజువెలా నౌకలను అమెరికా స్వాధీనం చేసుకున్నట్లయింది. తెల్లవారడానికి ముందు మెరీన్లు, నౌకాదళ సెయిలర్లు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ నుంచి ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఒలీనా అనే చమురు నౌకపై హెలికాప్టర్లు దిగుతున్న వీడియోను అమెరికా సైన్యం విడుదల చేసింది. ఈ నౌక చమురుతో వెనెజువెలా నుంచి బయలుదేరిందని అధికారులు తెలిపారు. గతంలో మినర్వా ఎం అని పేరున్న ఈ నౌక పనామా జెండాతో ఉండేదని, తాజాగా తీమూర్‌లెస్టే జెండాతో రష్యా చమురును రవాణా చేస్తోందని వివరించారు. హాంకాంగ్ కంపెనీతో రిజిస్టరు చేసినట్లు మేనేజరు తప్పుడు వివరాలిచ్చారని తెలిపారు.

అగమ్యగోచరం: అమెరికా సీజ్ చేసిన మ్యారినెరా చమురు ట్యాంకర్ నౌకలో పని చేస్తున్న ఇద్దరు రష్యన్ జాతీయులను విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించింది. మిగిలిన సిబ్బంది పరిస్థితిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నౌకలో ముగ్గురు భారతీయులతోపాటు 17 మంది ఉక్రేనియన్లు, ఆరుగురు జార్జియన్లు, ఇద్దరు రష్యన్లున్నారు.

# హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం..



నహాన్: హిమాచల్‌ప్రదేశ్‌లోని సిర్‌మౌర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేటు బస్సు 500 అడుగుల లోతు లోయలో పడి 14 మంది మృత్యువాతపడ్డారు. మరో 52 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం..శుక్రవారం మధ్యాహ్నం శిమ్లా నుంచి కుప్వికి వెళ్తున్న బస్సు హరిపుర్‌ధర్ వద్ద అదుపుతప్పి లోయలో పడింది. దీన్ని గుర్తించిన స్థానికులు బస్సులో ఉన్న క్షతగాత్రులను బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న సహాయక సిబ్బంది గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ రూ.2లక్షల పరిహారం ప్రకటించారు.

# మాకు గ్రీన్‌లాండ్ కావాలి



**వాషింగ్టన్: గ్రీన్‌లాండ్ కొనుగోలు, వెనెజువెలా కొత్త ప్రభుత్వం, ఇరాన్‌లో భారీ నిరసనలపై వైట్‌హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌లాండ్ విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలని ఐరోపా దేశాల నేతలకు ఆయన సూచించారు. గ్రీన్‌లాండ్‌పై శత్రుదేశాలు ఆసక్తి చూపుతుండటం అమెరికాతో పాటు ప్రపంచ క్షిపణి రక్షణ వ్యవస్థకు ముప్పేనన్నారు. ఇకనైనా ఐరోపా దేశాలు తమ భద్రతను సీరియస్‌గా తీసుకోవాలని, లేదంటే అందుకోసం తాము ఏదైనా చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. అమెరికా జాతీయ ప్రయోజనాలకు గ్రీన్‌లాండ్ ద్వీపం చాలా ముఖ్యమైందని జేడీ వాన్స్ తెలిపారు. ఈ విషయాన్ని తెలిపేందుకు వచ్చే వారం గ్రీన్‌లాండ్, డెన్మార్క్ నేతలతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ అవుతారని ఆయన చెప్పారు.**

**ఇరాన్ ప్రజలకు మా మద్దతు**

**ఇరాన్‌లో శాంతియుతంగా నిరసనలు నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరికి అమెరికా మద్దతు లభించి తీరుతుందని జేడీ వాన్స్ వెల్లడించారు. ప్రజల డిమాండ్లను ఇరాన్ పాలకులు వినాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇరాన్ విషయంలో ఏం చేయాలి అనే దానిపై స్వయంగా ట్రంప్ మాట్లాడతారని తెలిపారు. తాము ప్రపంచవ్యాప్తంగా హక్కుల కోసం గళం విప్పే ప్రతి ఒక్కరి పక్షాన నిలబడతామని వాన్స్ చెప్పారు.**

# సంపదలో 75%సమాజానికి ఇచ్చేస్తా

**——కుమారుడి హఠాన్మరణం వేళ వేదాంతా అగర్వాల్ పునరుద్ఘాటన**

వేదాంతా గ్రూప్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్, తన సంపదలో 75% కంటే ఎక్కువ మొత్తాన్ని సమాజానికి విరాళంగా ఇస్తానని పునరుద్ఘాటించారు. అమెరికాలో ఆయన కుమారుడు అగ్నివేశ్ ఆకస్మిక మరణం తర్వాత సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అనిల్ అగర్వాల్ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. భారత్ స్వయం సమృద్ధిపై తన కుమారుడు ఎంతో నమ్మకంతో ఉండేవారని అనిల్ గుర్తుచేసుకున్నారు. మన దేశానికి లోటు ఏమీ లేదని.. ఏ విషయంలోనూ వెనకబడి ఉండకూడదన్నది అగ్నివేశ్ అభిప్రాయంగా వెల్లడించారు. 'దేశంలో ఏ బిడ్డ ఆకలితో నిద్రపోకూడదు. ఏ ఒక్కరికీ విద్య నిరాకరించరాదు. ప్రతి మహిళ సొంత కాళ్లపై నిలబడాలి. ప్రతి యువ భారతీయుడు అర్థవంతమైన పనిని పొందాలి అనే కలను మేము పంచుకునేవాళ్లం. మనం సంపాదించిన దానిలో 75% కంటే ఎక్కువ మొత్తాన్ని సమాజానికి తిరిగి ఇద్దామని అగ్నితో కలిసి వాగ్దానం చేశాను. నేను ఈ రోజు ఆ వాగ్దానాన్ని పునరుద్ఘాటిస్తున్నాను. మరింత సాధారణమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నా' అని అగర్వాల్ పేర్కొన్నారు. పలువురికి అందించిన సాయంతో, వారి అభ్యున్నతి రూపంలో అగ్నివేశ్ జీవించే ఉంటారన్నది తన ఆలోచనగా అనిల్ తెలిపారు. అగ్నివేశ్ మరణించిన రోజును తన జీవితంలో 'చీకటి' దినంగా ఆయన అభివర్ణించారు. స్కీయింగ్ ప్రమాదంలో గాయపడిన



అగ్నివేశ్ న్యూయార్క్‌లోని మౌంట్ సినాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రమాదం నుంచి అతను బయటపడినట్లే భావించామని అనిల్ అగర్వాల్ వివరించారు.

ఈ సమయంలో కార్డియాక్ అరెస్ట్ ఆయన ప్రాణాలను బలిగొందన్నారు. 'బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధను వర్ణించడానికి పదాలు లేవు, ఒక కొడుకు తన తండ్రి కంటే ముందే చనిపోకూడదు. ఈ నష్టాన్ని మేము ఇంకా జీర్ణించుకోలేకపోతున్నాం' అని అనిల్ అగర్వాల్ వెల్లడించారు.

# చైనా కంపెనీలపై ఆంక్షల ఎత్తివేత?

**–ప్రభుత్వ కాంట్రాక్టుల బిడ్డింగ్‌కు అనుమతిచ్చే అవకాశం**

**–భారత ఆర్థిక శాఖ యోచన**



భారత ప్రభుత్వ కాంట్రాక్టులకు నేరుగా బిడ్డింగ్ దాఖలు చేయకుండా చైనా కంపెనీలపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని ఆర్థిక శాఖ భావిస్తున్నట్లు సమాచారం. సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో, చైనా కంపెనీలపై 2020లో మన ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ప్రధాని మోదీ ఆ దేశంలో పర్యటించాక, ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధాన్ని బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. మనదేశంలో వివిధ ప్రాజెక్టుల ఆలస్యాలకు పరిష్కారం చూపడంపైనా ఆర్థిక శాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. అందుకే అయిదేళ్ల నాటి ఆంక్షల ఎత్తివేత దిశగా ప్రణాళికలు రచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. చైనా కంపెనీలు పోటీ పడకుండా ఉన్న మన ప్రభుత్వ కాంట్రాక్టుల విలువ 700750 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6367.5 లక్షల కోట్ల) వరకు ఉంటుందని అంచనా. ఈ విషయంలో తుది నిర్ణయం ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎమ్ఓ) తీసుకుంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇదీ కారణం: భారత ఆంక్షల కారణంగా 216మి.డాలర్ల (సుమారు రూ.1940 కోట్ల) రైలు తయారీ కాంట్రాక్టు బిడ్డింగ్‌కు చైనా ప్రభుత్వ రంగ సంస్థ సీఆర్ఆర్సీ అర్హత సాధించలేకపోయింది. ఇందువల్లే పలు కీలక మౌలిక ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయని ప్రభుత్వానికి చెందిన ఇతర విభాగాలూ ఆర్థిక శాఖ దృష్టికి తీసుకొచ్చాయి. మినహాయింపులు ఇవ్వాలని పలు మంత్రిత్వ శాఖలూ కోరాయని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. చైనా నుంచి యంత్రాల దిగుమతులపైనా ఆంక్షల వల్ల, వచ్చే దశాబ్ద కాలంలో 307 గిగావాట్లకు థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్న భారత ప్రణాళికలపైనా దెబ్బపడుతోంది. కేంద్ర మంత్రివర్గ మాజీ కార్యదర్శి రాజీవ్ గౌబా ఆధ్వర్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ సైతం, చైనా కంపెనీలపై ఆంక్షలను సడలించాలని సిఫారసు చేసింది. ఈ ఆంక్షలను తొలగించినా చైనా కంపెనీల నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఆంక్షలను భారత్ కొనసాగించనుంది.

# 'బేర్'మన్న రూ.7.69 లక్షల కోట్లు




**–తారెత్తించిన అమెరికా 500% సుంకాల బిల్లు**

**——బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7.69 లక్షల కోట్లు తగ్గి రూ.472.25 లక్షల కోట్ల (5.25 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.**

మూడురోజులుగా నష్టపోతున్న మన సూచీలు, నాలుగోరోజు మరింత ఎరుపెక్కాయి. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు ఆపకపోతే, భారత ఉత్పత్తులపై 500% సుంకాలు విధించే బిల్లుకు ట్రంప్ ఆమోదం తెలపడమే ఇందుకు కారణం. ఫలితంగా మార్కెట్లపై బేర్ పట్టుబిగిసింది. సెన్సెక్స్, నిఫ్టీ సుమారు 1% నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలు, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలు ఆజ్యం పోశాయి. లోహ, చమురు గ్యాస్, కమొడిటీ కంపెనీల షేర్లకు తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు తగ్గి 89.94 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 2.55% పెరిగి 61.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా మినహా మిగతావన్నీ నష్టాల్లోనే ముగిశాయి.

**——ఆద్యంతం నష్టాల్లోనే...** బీఎస్ఈ సెన్సెక్స్ 84,778.02 పాయింట్ల వద్ద నష్టాల్లో ఆరంభమయ్యింది. నష్టాలు క్రమంగా పెరిగి, ఒక దశలో సూచీ 84,110.10 పాయింట్లను తాకింది. చివరకు 780.18 పాయింట్ల నష్టంతో 84,180.96 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలక 26,000 స్థాయి దిగువకు వచ్చింది. ఈ సూచీ 263.90 పాయింట్లు కోల్పోయి 25,876.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25,858.45 వద్ద కనిష్ఠాన్ని; 26,133.20 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

**——నాలుగే లాభాల్లో....** సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో నాలుగే లాభాల్లో ముగిశాయి. ఎటర్నల్ 0.91%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.48%, బజాజ్ ఫైనాన్స్ 0.29%, బీఈఎల్ 0.01% చొప్పున లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 2.94%, టీసీఎస్ 2.74%, టాటా స్టీల్ 1.93%, ట్రెంట్ 1.15%, పవర్ గ్రిడ్ 1.74%, ఇన్ఫోసిస్ 1.57%, ఎన్‌టీపీసీ 1.38% డీలాపడ్డాయి.

**——రిలయన్స్ షేరుకు 4 రోజుల్లో 8% నష్టం...** రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు గురువారమూ నష్టాలు కొనసాగాయి. బీఎస్ఈలో ఈ సంస్థ షేరు 2.25% నష్టపోయి రూ.1,470.30 వద్ద ముగిసింది. గత నాలుగు రోజుల్లో రిలయన్స్ షేరు మొత్తంగా 7.67% నష్టపోయింది. మార్కెట్ విలువ రూ.1,65,299.15 కోట్లు తగ్గి రూ.19,89,679.45 కోట్లకు పరిమితమైంది.

**——భారీ యంత్రపరికరాల షేర్లు డీలా....** ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం బిడ్ వేసే విషయంలో చైనా కంపెనీలపై ఉన్న ఆంక్షలను ఆర్థిక శాఖ ఎత్తివేసే అవకాశం ఉందంటూ వార్తలు రావడంతో, భెల్ సహా భారీ యంత్రపరికరాల రంగ కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. చైనా సంస్థల నుంచి పోటీ ఎదురవుతుందనే ఆందోళనే ఇందుకు కారణం. బీఎస్ఈలో భెల్ 10.34%, ఏబీబీ ఇండియా 4.86%, సీమెన్స్ 3.97%, ఎల్అండ్‌టీ 3.35%, హిటాచీ ఎనర్జీ 5.88%, ఐనాక్స్ విండ్ 4.11%, సుజ్లాన్ ఎనర్జీ 3.7%, టిటాగఢ్ రైల్ సిస్టమ్స్ 3.54% చొప్పున నష్టపోయాయి.

**——ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లకు 'సుంకాల' సెగ.....** అమెరికా 500% సుంకాల హెచ్చరికలతో, ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ షేరు ఇంట్రాడేలో 13% కుదేలైనా, చివరకు 8.49% నష్టంతో ముగిసింది. ఈ కంపెనీ మొత్తం ఆదాయంలో అమెరికా వాటానే 60 శాతానికి పైగా ఉండటం ఇందుకు కారణం. కేపీఆర్ మిల్ 4.01%, పెరల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ 7.9%, అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 8.01%, అవంతి ఫుడ్స్ 8.49% వరకు నష్టపోయాయి.

# జియో ఐపీఓ: 2.5%వాటా విక్రయించనున్న రిలయన్స్

మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఓల్లో రిలయన్స్ జియో ఒకటి. 50 కోట్ల మంది యూజర్లతో దేశంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీ కావడం, పైగా రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి పెద్ద సంస్థ నుంచి వస్తుండడంతో దీనిపై ఆసక్తి నెలకొంది. ఈ ఏడాదిలోనే రానున్న ఈ ఐపీఓకు సంబంధించి తాజాగా ఓ విషయం బయటకు వచ్చింది. తొలి పబ్లిక్ ఇష్యూ (IPO) ద్వారా 2.5 శాతం వాటాను రిలయన్స్ విక్రయించనున్నట్లు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. తద్వారా మార్కెట్ నుంచి సుమారు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.36 వేల కోట్లు) సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పేర్కొంది. దీంతో భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీఓగా ఇది నిలవనుంది. రిలయన్స్ జియో మార్కెట్ విలువను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫ్రీస్ 180 బిలియన్ డాలర్లుగా అంచనా కట్టింది. ఆ లెక్కన 2.5 శాతం వాటా విక్రయిస్తే సుమారు 4.5 బిలియన్ డాలర్లు అవుతుంది. ఈ వాటా విక్రయాన్ని ఆఫర్ ఫర్ సేల్ రూపంలో చేపడతారా లేక కొత్త షేర్ల జారీ ద్వారానా అనే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఐపీఓకు సంబంధించి మోర్గాన్ స్టాన్లీ, కోటక్ మహీంద్రా బ్యాంకు ముసాయిదా పత్రాల రూపకల్పనలో నిమగ్నమై ఉన్నాయని రాయిటర్స్ పేర్కొంది. అయితే ఈ విషయంలో రిలయన్స్ అధికారికంగా స్పందించలేదు. రిలయన్స్ జియోను రాబోయే ఐదేళ్లలో ఐపీఓకు తీసుకొస్తామని 2019లోనే ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఆ తర్వాత కేవలం టెలికాం వ్యాపారానికే పరిమితం కాకుండా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోకీ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. తద్వారా కంపెనీ మార్కెట్ విలువను భారీగా పెంచుకోగలిగింది. ఐపీఓ ఆలస్యం కావడానికి ఇదీ ఓ కారణం. ఇదిలా ఉండగా కొన్ని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు జియో మార్కెట్ విలువ 200 నుంచి 240 బిలియన్ డాలర్లుగా లెక్కగడుతున్నాయి. ఇటీవల కాలంలో అనేక కంపెనీలు రిలయన్స్ జియోలో పెద్ద మొత్తంలో




పెట్టుబడులు పెట్టాయి. ఐపీఓ సమయంలో తమ వాటాలను విక్రయించి సొమ్ము చేసుకోవాలని ఆయా కంపెనీలు చూస్తున్నాయి.

# ఐదో రోజూ నష్టాలే.. 25,700 దిగువకు నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఎఫ్ఐఐల అమ్మకాలు ప్రభావం చూపాయి. ముఖ్యంగా రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 25,700 దిగువకు చేరింది. గడిచిన ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,200 పాయింట్లకు పైగా పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లపై ఆ దేశ సుప్రీంకోర్టు నేటి (శుక్రవారం) రాత్రి తీర్పు వెలువరించనుంది. ఒకవేళ ఆయనకు వ్యతిరేకంగా తీర్పు వస్తే మన మార్కెట్లకు ఊరట కలుగుతుంది. అనుకూలంగా తీర్పు వస్తే ఆయా దేశాలపై మరిన్ని టారిఫ్‌లు విధించేందుకు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. ఇది మార్కెట్లకు ప్రతికూల అంశం. ఈ నేపథ్యంలో ఈ వారాంతంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. సెన్సెక్స్ ఈ రోజు ఉదయం 84,022.09 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,180.96) నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. మధ్యాహ్నం తర్వాత మరింత అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇంట్రాడేలో 83,402.28 వద్ద కనిష్ఠాలను తాకిన సూచీ.. చివరకు 604.72 పాయింట్ల నష్టంతో 83,576.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 193.55 పాయింట్ల నష్టంతో 25,683.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.16గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ప్రధానంగా ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బీఈఎల్, రిలయన్స్, ఎటెర్నల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.12 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,471 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# విమాన తయారీలోకి అదానీ గ్రూప్

**–ఎంబ్రాయర్‌తో ఒప్పందం**




బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్, మనదేశంలో విమానాల రూపకల్పనకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకవసరమైన తుది అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయడం కోసం, అదానీ గ్రూప్‌తో ఎంబ్రాయర్, ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. భారత విమాన రంగంలోని భారీ అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసం ఎంబ్రాయర్ గత అక్టోబరులో దిల్లీలో తన కార్యాలయాన్ని నెలకొల్పింది. ఎంబ్రాయర్‌తో ఒప్పందం ద్వారా భారత్‌లో విమానాల తయారీ రంగంలోకి అదానీ గ్రూప్ అడుగుపెట్టినట్లయింది. ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) ఏర్పాటు నిమిత్తం ఎంబ్రాయర్‌తో ఇటీవలే అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదానీ, ఎంబ్రాయర్‌ల నుంచి ఈ విషయంపై అధికారిక స్పందన రాలేదు. 'విమానయాన రంగంలో అతితక్కువ ప్రతిఫలం లభించే మార్కెట్లలో భారత్ ఒకటి. ఇక్కడ నిర్వహణ ఖర్చులు ఎంత తక్కువగా ఉండి, అంత ఎక్కువమందిని చేరవేయగలిగితేనే మనుగడ ఉంటుంది. 146 మంది ప్రయాణించేందుకు అనువైన తమ ఈ195ఈ2 విమానం ఈ విపణికి ఎంతో అనువైనద'ని ఎంబ్రాయర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాల్ విలరాన్ తెలిపారు.

# అలయంజ్‌కు బజాజ్ గుడ్‌బై

BAJAJ

బజాజ్ గ్రూప్, బీమా సంస్థ అలయంజ్ మధ్య ఉన్న 24 ఏళ్ల అనుబంధానికి తెరపడింది. బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లలో జర్మనీకి చెందిన అలయంజ్ ఎస్ఈ నుంచి 23% వాటాను రూ.12,190 కోట్లు, రూ.9,200 కోట్లు చొప్పున వెచ్చించి కొనుగోలు చేసినట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రకటించింది. ఈ కొనుగోలు పూర్తితో బజాజ్ గ్రూప్‌నకు ఈ రెండు బీమా కంపెనీల్లో వాటా 97%, 74 శాతానికి చేరింది. బజాజ్ ఫిన్‌సర్వ్‌కున్న 75.01% వాటా కారణంగా ఈ బీమా కంపెనీలపై నియంత్రణ దక్కింది. ఈ వాటా కొనుగోలు పూర్తితో బజాజ్ ఫిన్‌సర్వ్, అలయంజ్ ఎస్ఈల సంయుక్త సంస్థ (జేవీ)కు ముగింపు పలికినట్లయింది.




# భారత్ కోకింగ్ కోల్ ఐపీఓ..

## నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి


ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు (Bharat Coking Coal IPO) అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అంటే 2.43 రెట్లు స్పందన లభించింది. కేటగిరీ వారీగా చూసినప్పుడు.. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 3.79 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అయ్యింది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 3.35 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్ బయ్యర్ల కోటా 1 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.273 కోట్లు సమీకరించినట్లు భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ గురువారం వెల్లడించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా మొత్తం రూ.1,071 కోట్లు సమీకరించనుంది. జనవరి 13న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ధరల శ్రేణిని రూ.21-23గా కంపెనీ నిర్ణయించింది. 1972లో భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటైంది. జారియా (ఝార్ఖండ్), రాణిగంజ్ (పశ్చిమ బెంగాల్)లోని కోల్ మైన్స్ నుంచి కోకింగ్ కోల్‌ను సరఫరా చేస్తోంది. కోల్ ఇండియా వాల్యూ అన్‌లాక్‌లో భాగంగా అనుబంధ సంస్థలో వాటాలను ప్రభుత్వం విక్రయం చేపట్టింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (OFS) ద్వారా జరుగుతోంది. కోల్ ఇండియా 46.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తోంది. జనవరి 16న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో కంపెనీ షేర్లు లిస్ట్ కానున్నాయి.

# యాక్షన్... ప్రియాంక



గతేడాది 'హెడ్స్ ఆఫ్ స్టేట్' చిత్రంతో ప్రేక్షకులకు థ్రిల్ పంచింది బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా. ఇప్పుడామె ఖాతాలో రాబోయే మరో యాక్షన్ అడ్వెంచర్ హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్'. దర్శక నిర్మాత ఫ్రాంక్.ఇ.ఫ్లవర్స్ తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రియాంకతో పాటు కార్ల్ అర్బన్ నటించారు. తాజాగా ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో అధికారికంగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ.. ప్రియాంక ఫస్ట్‌లుక్ పోస్టర్‌లను ఆవిష్కరించింది. ఈ సినిమా ఫిబ్రవరి 25 నుంచి ప్రైమ్‌లో ప్రసారం కానుంది. "తల్లి, రక్షకురాలు, పైరేట్.. 'బ్లడీ మేరీ"ని కలవండి అంటూ ఇన్‌స్టాలో విడుదలైన ఈ పోస్టర్‌లలో ప్రియాంక గన్ చేతపట్టి కిల్లింగ్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది. "ఈ సినిమాతో ప్రియాంక.. కుటుంబం కోసం రక్తపాతాన్ని విడిచిపెట్టి ప్రశాంతంగా జీవిస్తున్న మాజీ పైరేట్ మేరి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది. ఆమెపై ప్రతీకారం తీర్చుకోవడానికి తన బృందం తిరిగి వచ్చినప్పుడు.. తాను ప్రేమించే వారిని రక్షించాలనే సంకల్పంతో కత్తి యుద్ధాలు, వ్యూహాత్మక పోరాటాల నేపథ్యంతో ఈ సినిమా రూపొందింద"ని చిత్రవర్గాల సమాచారం.

# ప్రభాస్ మూవీలో నటిస్తారా ?
## యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్







యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్(ప్రజెంట్ 'రాజా సాబ్' మూవీలో నటిస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్(హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రం ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉంది. ఇక ఈ సినిమాలో నిధి అగర్వాల్, రిద్ధి కుమార్(Ridhi Kumar)లు కూడా హీరోయిన్లుగా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి.విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ సినిమాను పూర్తి హారర్ కామెడీ జోనర్‌లో రూపొందించారు మేకర్స్.

దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ అయింది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. అయితే ఈ మూవీ జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఈ క్రమంలో ప్రమోషన్స్ జోరు పెంచిన మాళవిక వరుస ఇంటర్వ్యూలో పాల్గొంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంటుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు మాట్లాడుతూ.. 'ప్రభాస్ సినిమాలో నటిస్తారా అని ఫోన్ వస్తే స్కామ్ కాల్ అనుకున్నాను. ఎందుకంటే స్టార్టింగ్‌లో హీరో విజయ్ దేవరకొండతో నాకు సినిమాలో నటించే అవకాశం వచ్చింది.

అయితే అప్పటికే అతనితో నాకు మంచి స్నేహం ఉండడం, మైత్రీ లాంటి పెద్ద నిర్మాణ సంస్థ ఆ సినిమాను ప్రొడ్యూస్ చేస్తుండడంతో సంతోషంగా ఆ మూవీ ఒప్పుకున్నాను. అయితే విజయ్ ఆ సినిమా బదులు లైగర్ చేయాలని అనుకోవడంతో కొంత షూటింగ తర్వాత ఆ సినిమా ఆగింది. అలా నా తెలుగు డెబ్యూ అప్పుడు మిస్సయింది. తర్వాత సలార్ సినిమాకు నాతో టీం సంప్రదింపులు జరిపిన మాట వాస్తవమే.. కానీ అగ్రిమెంట్ లాంటిదేమీ జరగలేదు.. డేట్లు సర్దుబాటు కాకపోవడం, వేరే ఇబ్బందుల వల్ల నేను ఆ సినిమా చేయలేకపోయాను. ఆఫ్టర్ 8 మంత్స్ తర్వాత రాజా సాబ్ మూవీ కోసం కాల్ వచ్చింది. అందుకే నేను స్కామ్ కాల్ అనుకున్నాను. కానీ రాజాసాబ్ లాంటి మూవీతో తెలుగులోకి అరంగేట్రం చేయడం చాలా ఆనందంగా ఉంది' అని ఆమె చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.

# పరాశక్తి'కి సెన్సార్ పూర్తి..
## వాదాలను దాటి విడుదలకు మార్గం సుగమం




మరో తమిళ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. శివకార్తికేయన్ కథానాయకుడిగా సుధ కొంగర దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామా 'పరాశక్తి'. జనవరి 10న (Parasakthi release date) ఈ చిత్రం తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. శ్రీలీల, రవి మోహన్, అథర్వ మురళీ నటించారు. గురువారం రాత్రి వరకూ సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో సినిమా వస్తుందా? రాదా? అన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ఎట్టకేలకు శుక్రవారం ఉదయం 'పరాశక్తి'కి యూ/ఏ ఇస్తూ సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చింది. దీంతో అనుకున్న తేదీ ప్రకారం జనవరి 10న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. 1960లలో తమిళనాడులోని హిందీ వ్యతిరేక నిరసనల నేపథ్యంతో ఇద్దరు స్నేహితుల చుట్టూ తిరుగుతున్న కథాంశంతో రూపొందినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

**ఆద్యంతం వార్తల్లో నిలుస్తూ..**

సినిమా ప్రారంభం నుంచి టైటిల్ వరకూ ఏదోఒక సందర్భంలో 'పరాశక్తి' వార్తల్లో నిలుస్తూనే ఉంది. విజయ్ ఆంటోని తమిళంలో రూపొందించిన 'శక్తి తిరుమగణ్'కు తెలుగులో 'పరాశక్తి' అని పేరు పెట్టారు. టైటిల్ విషయంలో కొన్ని రోజుల పాటు చర్చ నడిచింది. ఆ టైటిల్ పెట్టడంపై విజయ్ ఆంటోనీ (Vijay Antony) కూడా క్లారిటీ ఇచ్చారు. తాను గతంలోనే ఈ పేరు రిజిస్టర్ చేయించుకున్నానని తెలియజేశారు. అంతేకాదు, తెలుగులో తాను 'పరాశక్తి' అనే టైటిల్ ఉపయోగించుకునేలా దిసౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన అధికారిక పత్రాన్ని కూడా షేర్ చేశారు. హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజ్‌లో కొన్ని రోజుల పాటు 'పరాశక్తి' షూట్ జరిగింది. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ సైతం స్పందించారు. విద్యార్థినుల భద్రతే తమకు ముఖ్యమని, కేవలం సెలవు రోజుల్లో మాత్రమే షూటింగ్‌లకు అనుమతిస్తామని చెప్పారు.

ఇక 'పరాశక్తి' విడుదల తేదీ విషయంలోనూ వార్తల్లో నిలిచింది. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రాన్ని జనవరి 14న విడుదల చేయాలనుకున్నారు. రెండు భాషల్లో విడుదలవుతున్న 'పరాశక్తి'కి తెలుగులో థియేటర్స్ దొరకడం కాస్త కష్టమే. ఎందుకంటే సంక్రాంతి పండగ మూడు రోజులు ఇక్కడ వరుస సినిమాలు సందడి చేయనున్నాయి. ఈ క్రమంలో అప్పుడు రావడం సరైన నిర్ణయం కాదని చిత్రబృందం భావించింది. దీంతో విడుదల తేదీని కాస్త ముందుకు జరిపారు. ప్రభాస్ 'ది రాజా సాబ్' ఇప్పటికే విడుదల కాగా, జనవరి 12న చిరంజీవి 'మన శంకరవరప్రసాద్‌గారు', జనవరి 13న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', జనవరి 14న 'నారీ నారీ నడుమ మురారి', జనవరి 14న 'అనగనగా ఒక రాజు' చిత్రాలు సందడి చేయబోతున్నాయి. దీంతో 'పరాశక్తి'ని జనవరి 10వ తేదీకి మార్చారు. ఆకాశ్ భాస్కరన్‌కు చెందిన డాన్ పిక్చర్స్ రూ.150 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించింది.

# దేఖో విష్ణు విన్యాసం



గతేడాది 'హెడ్స్ ఆఫ్ స్టేట్' చిత్రంతో ప్రేక్షకులకు థ్రిల్ పంచింది బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా. ఇప్పుడామె ఖాతాలో రాబోయే మరో యాక్షన్ అడ్వెంచర్ హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్'. దర్శక నిర్మాత ఫ్రాంక్.ఇ.ఫ్లవర్స్ తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రియాంకతో పాటు కార్ల్ అర్బన్ నటించారు. తాజాగా ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో అధికారికంగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ.. ప్రియాంక ఫస్ట్‌లుక్ పోస్టర్‌లను ఆవిష్కరించింది. ఈ సినిమా ఫిబ్రవరి 25 నుంచి ప్రైమ్‌లో ప్రసారం కానుంది. ''తల్లి, రక్షకురాలు, పైరేట్.. 'బ్లడీ మేరీ''ని కలవండి అంటూ ఇన్‌స్టాలో విడుదలైన ఈ పోస్టర్‌లలో ప్రియాంక గన్ చేతపట్టి కిల్లింగ్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది. ''ఈ సినిమాతో ప్రియాంక.. కుటుంబం కోసం రక్తపాతాన్ని విడిచిపెట్టి ప్రశాంతంగా జీవిస్తున్న మాజీ పైరేట్ మేరి పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది. ఆమెపై ప్రతీకారం తీర్చుకోవడానికి తన బృందం తిరిగి వచ్చినప్పుడు.. తాను ప్రేమించే వారిని రక్షించాలనే సంకల్పంతో కత్తి యుద్ధాలు, వ్యూహాత్మక పోరాటాల నేపథ్యంతో ఈ సినిమా రూపొందింద''ని చిత్రవర్గాల సమాచారం.

# 'కాంతార', 'మహావతార్ నరసింహ' జోరు..
## ఆస్కార్ బరిలో మరో ముందడుగు

ఈ ఏడాది ఆస్కార్ (Oscar) బరిలో హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన రెండు సినిమాలు పోటీపడనున్నాయి. ప్రతిష్ఠాత్మక ఈ అవార్డుల రేసులో ఉన్న కాంతార: చాప్టర్ 1 (kantara chapter 1), మహావతార్ నరసింహ (Mahavathar Narasimha) చిత్రాలు మరో ముందడుగు వేశాయి. ఆస్కార్ అవార్డ్స్‌ల జనరల్ ఎంట్రీలో చోటు దక్కించుకున్నాయి. దీంతో ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ డైరెక్టర్‌తో పాటు నిర్మాత, స్క్రీన్‌ప్లే, ప్రొడక్షన్ డిజైన్, సినిమాటోగ్రఫీ వంటి ఇతర కేటగిరీల్లోనూ ఇవి పోటీపడబోతున్నాయి. ఈ విషయాన్ని తెలుపుతూ హోంబలే ఫిల్మ్స్ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఆస్కార్‌కు రెండు అడుగుల దూరంలో ఉన్నామని తెలిపింది.

ఇక 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15న జరగనుంది (Oscars 2026). ఆస్కార్ కోసం పోటీపడనున్న చిత్రాల తుది జాబితాను 2026 జనవరి 22న ప్రకటించనున్నట్లు అకాడమీ వెల్లడించింది. లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో ఈ 98వ ఆస్కార్ వేడుక జరగనుంది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు విడుదలైన చిత్రాలు ఇందులో పోటీపడనున్నాయి.

'కాంతార 1', 'మహావతార్ నరసింహ'లతో పాటు ఈ ఏడాది ఆస్కార్‌కు భారత్ నుంచి ఐదు చిత్రాలు పోటీపడనున్నాయి. 'టూరిస్ట్ ఫ్యామిలీ', 'తన్వీ ది గ్రేట్', 'సిస్టర్ మిడ్‌నైట్' సినిమాలు ఆస్కార్ బరిలో నిలిచాయి. దీంతో జనవరి 22న తుది నామినేషన్ల జాబితా కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# ది రాజాసాబ్'.. ప్రభాస్ ఫాంటసీ హారర్ కామెడీ ఎలా ఉంది?

**ఇటీవల కాలంలో అగ్ర కథానాయకుడు ప్రభాస్ (Prabhas) నటించిన సినిమాలన్నీ పాన్ ఇండియా సీరియస్ సబ్జెక్ట్‌లే. అభిమానులు వింటేజ్ ప్రభాస్‌ను చూసి చాలా కాలమైంది. ఆ లోటును తీర్చడానికే వస్తున్నామంటూ ప్రచార చిత్రాలతోనే ఆసక్తిని పెంచారు దర్శకుడు మారుతి. ఆయన దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ 'ది రాజాసాబ్'. ట్రైలర్‌తోనే అంచనాలను పెంచిన ఈ మూవీ ఎలా ఉంది? (Rajasaab Review) ఎలాంటి థ్రిల్ పంచింది?**

**కథేంటంటే...**

‖ దేవనగర సంస్థానానికి ఒకప్పుడు జమిందారు గంగాదేవి (జరీనా వహాబ్). అంత గొప్ప నేపథ్యమున్నా తన మనవడు రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)తో కలిసి గంగమ్మగా సాధారణ జీవితం గడుపుతుంటుంది. తన నానమ్మ అంటే రాజుకు ప్రాణం. వయసు ప్రభావం కారణంగా మతిమరుపు సమస్యలతో బాధపడుతూ ఉంటుంది గంగమ్మ. తనకు సంబంధించిన చాలా విషయాల్ని మరిచిపోయినా తన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం మరిచిపోదు. తనకు కలలో కనిపిస్తున్న తాతని ఎలాగైనా వెతికి తీసుకురమ్మని రాజాసాబ్‌ని కోరుతుంది. కానీ, కనకరాజే తనకున్న రకరకాల విద్యలతో నాన్నమ్మ, మనవడిని నర్సాపూర్ అడవిలోని రాజమహల్‌కి వచ్చేలా చేస్తాడు. ఒక దశలో ఇద్దరినీ చంపేయాలని కూడా అనుకుంటాడు. మార్మిక విద్యలెన్నో తెలిసిన కనకరాజుని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడు? అసలు కనకరాజు గతమేమిటి? అతని లక్ష్యమేమిటి? రాజాసాబ్ జీవితంలోకి వచ్చిన ముగ్గురమ్మాయిలు భైరవి (మాళవిక మోహనన్), బ్లెస్సీ (నిధి అగర్వాల్) అనిత (రిద్ధి కుమార్) ఎవరు? తదితర విషయాలను తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

ఎలా ఉందంటే..

‖ కొంతకాలంగా లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్న ప్రభాస్ ఓ కొత్త జోనర్‌లో సినిమా చేయాలనుకోవడం... అలాంటి స్టార్ కథానాయకుడితో దర్శకుడు మారుతి ఓ హారర్ ఫాంటసీ సినిమా చేయాలనుకోవడం మంచి పరిణామమే. ఇలాంటి ప్రయత్నాలతోనే కొత్త కథలు వెలుగులోకి వస్తుంటాయి. సినిమా ఆరంభమయ్యాక ఒకప్పటి ప్రభాస్ మళ్లీ తెరపై కనిపించిన అనుభూతి



నిస్సందేహంగా కలుగుతుంది. చాలా ఏళ్లుగా మిస్ అయిన డార్లింగ్‌లోని కామెడీ కోణాన్ని ఇందులో చూపించేందుకు దర్శకుడు మారుతి చేసిన ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన రాసుకున్న కాన్సెప్ట్ ఆసక్తికరంగానే ఉన్నప్పటికీ, దాన్ని తెరపైకి తీసుకు రావడంలో మాత్రం కాస్త తడబాటు కనిపించింది. ముఖ్యంగా ప్రథమార్ధంలోని సన్నివేశాలు అనుకున్నంత ప్రభావం చూపించకుండానే సాగిపోతుంటాయి. రాజ్ మహల్‌లోకి అడుగుపెట్టే సన్నివేశం కాస్త ఉత్కంఠ రేకెత్తిస్తుందంతే. హారర్ ఎలిమెంట్స్ ఉంటాయి కానీ, కథలో టెన్షన్ బిల్డప్ కాకపోవడంతో అవి అంతగా ప్రభావం చూపించవు. కామెడీ సన్నివేశాలూ ఉంటాయి. చాలా సినిమాల్లో చూసిందే కదా అనిపిస్తుంది తప్ప, ఏదీ కొత్తగా అనిపించదు. పాటలూ అంతగా మెప్పించవు.

ప్రభాస్ వర్సెస్ సంజయ్ దత్ అన్నట్టుగా కథ మారిపోయాక ద్వితీయార్ధంపై కాస్త ఆసక్తి కలుగుతుంది. సుదీర్ఘంగా సాగే పతాక సన్నివేశాలే ఈ సినిమాకి హైలైట్. కనకరాజు, గంగాదేవిల కథ, కనకరాజు పాత్రలో సంజయ్ దత్ ఆడే మైండ్ గేమ్, మార్మిక విద్యలతో ఆ పాత్ర హీరోకి సవాల్ విసిరే తీరు, బలమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో తీర్చిదిద్దిన ఆయా సన్నివేశాలు సినిమాని నిలబెట్టాయి. వాటిలో ప్రభాస్ కనిపించిన విధానం, ఆయన చేసిన యాక్షన్, కామెడీ కూడా మెప్పిస్తుంది. ట్రైలర్‌లో చూపించిన చాలా సన్నివేశాలు సినిమాలో కనిపించలేదు. 'రాజాసాబ్ సర్కస్'అంటూ కొనసాగింపునకు లీడ్ ఇచ్చారు. మరి రెండో భాగంలో చూపిస్తారేమో ఆ సన్నివేశాలన్నీ. మొత్తంగా ప్రభాస్‌ని చాలా రోజుల తర్వాత ఓ కొత్త జోనర్‌లో, కామెడీ పాత్రలో చూశామన్న అనుభూతి కలుగుతుంది.

ఎవరెలా చేశారంటే..

‖ప్రభాస్ (Prabhas) ఆద్యంతం ఉత్సాహంగా కనిపిస్తూ నవ్వులు పండించే ప్రయత్నం చేశారు. ఇందులో ఆయన లుక్ కూడా స్టైలిష్‌గా, అభిమానులకు నచ్చేలా ఉంటుంది. పతాక సన్నివేశాల్లో ఆయన నటన మరింతగా ఆకట్టుకుంటుంది. కథానాయికల్లో మాళవిక మోహనన్ తెరపై ఎక్కువసేపు కనిపిస్తుంది. ఆమె అందంగా కనిపించడంతోపాటు, ఓ యాక్షన్ ఘట్టంలోనూ మెరిసింది. నిధి అగర్వాల్ పాటల్లో మాత్రమే ప్రధాన ఆకర్షణ. రిద్ధికుమార్ పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. కథలో కీలకమైన కనకరాజు పాత్రలో సంజయ్‌దత్ కనిపించిన తీరు బాగుంది. అయితే హిప్నాటిస్ట్, సైకియాట్రిస్ట్ అంటూ ఆ పాత్రని పరిచయం చేసిన స్థాయిలో మాత్రం తెరపై కనిపించదు. జరీనా వాహబ్ పాత్ర ఈ సినిమాకి కీలకం. ఇది మనవడు, నానమ్మ కథ కావడంతోనే జరీనా వాహబ్ పాత్రకి ప్రాధాన్యం దక్కింది. బొమన్ ఇరానీ, సముద్రఖని తదితరులు కీలకమైన పాత్రల్లో కనిపిస్తారు. ప్రభాస్‌శ్రీను, సప్తగిరి, సత్య, వీటీవీ గణేశ్ అక్కడక్కడా నవ్వించారంతే. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. తమన్ నేపథ్య సంగీతం సినిమాకి ప్రధాన బలం. కార్తీక్ పళని కెమెరా పనితనం ఆకట్టుకుంటుంది. ఎడిటింగ్, రచనలో లోటుపాట్లు కనిపిస్తాయి. విజువల్ ఎఫెక్ట్స్ మెప్పిస్తాయి. నిర్మాణం ఉన్నతంగా ఉంది.

**రివ్యూ**

**బలాలు**

**+ ప్రభాస్ నటన... లుక్**

**+ పతాక సన్నివేశాలు**

**+ హారర్ ఫాంటసీ కాన్సెప్ట్**

**బలహీనతలు**

**- కొత్తదనం లేని కథనం**

**- తేలిపోయిన హాస్యం**

**చివరిగా: ది రాజాసాబ్... ప్రభాస్ కోసం!**
**(raja saab movie review)**

**గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!**

# ఆ కివీస్ స్పిన్నర్ మనోడే..



న్యూజిలాండ్ క్రికెట్ జట్టు జనవరి 11 నుంచి భారత్‌లో పర్యటించనుంది. ఇందులోభాగంగా 3 వన్డేలు, 5 టీ20లు ఆడనుంది. న్యూజిలాండ్ టీ20 జట్టులో యువ స్పిన్నర్ ఆదిత్య అశోక్ (Adithya Ashok) స్థానం దక్కించుకున్నాడు. అతడి స్వస్థలం తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు. అతడి తల్లిదండ్రులు ఆదిత్యకు 4 సంవత్సరాల వయసున్నప్పుడు న్యూజిలాండ్‌కు వలస వెళ్లారు. అతడికి తన తాతతో చక్కటి అనుబంధం ఉంది. మరణించిన తన తాతకు గుర్తుగా తన బౌలింగ్ ఆర్మ్‌పై సూపర్ స్టార్ రజినీకాంత్ డైలాగ్ 'నా దారి రహదారి' అని అర్థం వచ్చేలా.. తమిళ అక్షరాలతో ఓ టాటూ కూడా వేయించుకున్నాడు. 23 యేళ్ల ఆదిత్య అశోక్ తరచూ భారత్‌ను సందర్శిస్తుంటాడు. అయితే అతడు గత సంవత్సరం కొన్ని వారాలపాటు చెన్నైలోని సీఎస్కే అకాడమీలో కొంతకాలం గడిపాడు. దీంతో అతడు ఇక్కడి పిచ్ పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాడు. 'మొదట నేను చెన్నై అనుభవం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. అలాంటి అవకాశం రావడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నా. నేను ఇక్కడ చాలా విషయాలు నేర్చుకున్నా. బంకమట్టి (బ్లాక్ సాయిల్) పిచ్, ఎర్రమట్టి (రెడ్ సాయిల్) పిచ్‌ల మీద నాకు అవగాహన వచ్చింది. అవి ఎలా ప్రవర్తిస్తాయో ఒక అంచనా ఏర్పడింది' అని ఆదిత్య అశోక్ అన్నాడు. అలాగే తన ఆల్‌టైమ్ ఫేవరెట్ స్పిన్నర్ షేన్‌వార్న్ అని అతడు వివరించాడు. 'మీరు నన్ను నీ ఫేవరెట్ ఆల్‌టైమ్ లెగ్‌స్పిన్నర్ ఎవరని అడిగితే.. షేన్‌వార్న్ పేరు చెప్పకుండా ఉండటం చాలా కష్టం. కానీ న్యూజిలాండ్‌లో పెరగడం బాగుంది. ఇష్ సోధీతో చక్కటి అనుబంధం ఉండటం నిజంగా నా అదృష్టం. అతడు నాకు పెద్దన్నలాంటోడు. నేను ఇష్ బౌలింగ్ చూస్తూ పెరిగాను' అని ఆదిత్య వివరించాడు.

# తిలక్ లేకుంటే ఎవరు?





గత రెండేళ్లలో భారత టీ20 జట్టులో ఉత్తమ బ్యాటర్లలో ఒకడిగా ఎదిగాడు తిలక్ వర్మ. ఇంకో నాలుగు వారాల్లో సొంతగడ్డపై మొదలయ్యే టీ20 ప్రపంచకప్‌లోనూ అతడిపై భారీ అంచనాలే నెలకొన్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతూ ఆ మెగా టోర్నీకి సన్నద్ధమవుతున్న వేళ.. తిలక్ అనూహ్యంగా మైదానానికి దూరమయ్యాడు. వృషణాలకు శస్త్రచికిత్స జరగడంతో కొన్ని వారాల పాటు అతను మైదానంలో కనిపించబోడు. ప్రస్తుతానికి న్యూజిలాండ్‌తో ఈ నెల 21న మొదలయ్యే అయిదు టీ20ల సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు మాత్రమే దూరమైనట్లు బీసీసీఐ ప్రకటించింది. టీ20 ప్రపంచకప్‌లోనూ ఆరంభంలో ఒకట్రెండు మ్యాచ్‌లకు తిలక్ దూరమవుతాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరి అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారన్నది ఆసక్తికరం.

**శ్రేయస్ అయ్యర్**

గత ఏడాది ఆసియా కప్ ఫైనల్లో తిలక్ వర్మ ఎంత గొప్ప ఇన్నింగ్స్ ఆడాడో అభిమానులకు గుర్తుండే ఉంటుంది. అంతకుముందు ఏడాది దక్షిణాఫ్రికాలో వరుసగా రెండు శతకాలు బాదిన ఘనత తిలక్ సొంతం. ఇటీవల సొంతగడ్డపై ఆ జట్టుతో సిరీస్‌లోనూ తిలక్ రాణించాడు. ఇలాంటి ఆటగాడు ఇప్పుడిలా అనూహ్యంగా జట్టుకు దూరం కావడం భారత్‌కు ఎదురు దెబ్బే. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తిలక్ స్థానాన్ని భర్తీ చేయడానికి ఉన్న ప్రత్యామ్నాయాలు ఏంటని చూస్తే.. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ లాంటి ఆటగాళ్లు కనిపిస్తున్నారు. అయితే శుభ్‌మన్‌ను టీ20ల్లో భవిష్యత్ కెప్టెన్‌గా చేసే ఉద్దేశంతో కొన్ని నెలల కిందట కోచ్ గంభీర్.. అతడికి ఉపసారథిగా బాధ్యతలు అప్పగించి తిరిగి టీ20 జట్టులోకి తీసుకొచ్చాడు. కానీ ఈ అవకాశాన్ని శుభ్‌మన్ ఉపయోగించుకోలేకపోయాడు. పునరాగమనంలో 15 మ్యాచ్‌లు 24.25 సగటుతో ఆడి 291 పరుగులే చేశాడు. దీంతో టీ20 ప్రపంచకప్‌నకు అతడిని ఎంపిక చేయలేదు. న్యూజిలాండ్ సిరీస్‌కూ జట్టులోకి తీసుకోలేదు. విఫల ఆటగాడిగా ముద్ర పడ్డ గిల్‌ను తిరిగి టీ20 జట్టులోకి తీసుకుంటారా అన్నది సందేహమే. యశస్వి జైస్వాల్‌కు పరిమిత ఓవర్ల క్రికెట్లో దొరికిన అవకాశాలు తక్కువే. పైగా అతను ఓపెనర్. అభిషేక్ శర్మకు తోడుగా సంజు శాంసన్ ఓపెనర్‌గా ఖరారైన నేపథ్యంలో అతణ్ని జట్టులోకి ఎంపిక చేస్తారా అన్నది సందేహమే. తిలక్ స్థానంలో మిడిలార్డర్లో ఆడే బ్యాటర్ అవసరం కాబట్టి శ్రేయస్ అయ్యర్ సరైన ప్రత్యామ్నాయం అవుతాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శ్రేయస్‌కు ఐపీఎల్‌లో గొప్ప రికార్డుంది. వన్డేల్లో కూడా బాగా ఆడుతున్నాడు. ఇటీవలే గాయం నుంచి కోలుకుని జట్టులోకి పునరాగమనం చేసిన అతను.. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో ఆడబోతున్నాడు. ఇందులో రాణిస్తే.. ముమ్ముందు టీ20 జట్టులో ఎంపికకు కూడా శ్రేయస్ పరిగణనలో ఉంటాడు.

## ర్యాపిడ్ విజేత నిహాల్



కోల్‌కతా: యువ గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్ టాటా స్టీల్ చెస్ ర్యాపిడ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 9 రౌండ్ల నుంచి 6.5 పాయింట్లతో అతడు అగ్రస్థానం సాధించాడు. అతడు శుక్రవారం తొమ్మిదో రౌండ్లో ఆనంద్‌ను నిలువరించాడు. నిహాల్ తాత గురువారమే కన్నుమూశారు. నిహాల్‌కు చెస్‌ను పరిచయం చేసింది ఆయనే. ఈ టైటిల్‌ను తన తాతకు అంకితమిస్తున్నట్లు నిహాల్ చెప్పాడు. ఆనంద్ (6) రెండో స్థానంలో నిలవగా.. అర్జున్ ఇరిగేశి అయిదు పాయింట్లతో మూడో స్థానం సాధించాడు. ప్రజ్ఞానంద 4.5 పాయింట్లతో ఆరో స్థానంతో ముగించాడు. మహిళల విభాగంలో రష్యాకు చెందిన కేతరినా లాంగో (6.5) టైటిల్‌ను గెలుచుకుంది. మరో రష్యా అమ్మాయి అలెగ్జాండ్రా గోర్యచ్కినా అయిదు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ప్రపంచకప్ ఛాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ (4.5) మూడో స్థానం సాధించింది. దివ్యతో సమాన స్కోరు చేసినా టైబ్రేక్ స్కోరులో వెనకబడిన హారిక (4.5) నాలుగో స్థానం, వైశాలి (4.5) అయిదో స్థానంతో

# వాళ్లు అన్నంత పనీ చేస్తారేమో..: బంగ్లా ఆటగాళ్లలో గుబులు



భారత్, బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ బంగ్లా క్రికెటర్ల స్పాన్సర్‌షిప్‌లకు ఎసరు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి! బంగ్లాదేశ్ కెప్టెన్ లిటన్ దాస్, యాసిర్ అలీ, మోమినుల్ హక్ వంటి టాప్ ప్లేయర్లకు భారత సంస్థ ఎస్‌జీ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ సంస్థ తమ స్పాన్సర్‌షిప్‌ను కొనసాగించకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంతవరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ పరిణామాలపై బంగ్లా క్రికెటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. 'త్వరలోనే ఎస్‌జీ స్పాన్సర్‌గా వైదొలగొచ్చు' అని ఓ క్రికెటర్ ఓ వెబ్‌సైట్‌తో చెప్పినట్లుగా వార్తలు వస్తున్నాయి. 'ఒకవేళ ఎస్‌జీ అలాంటి నిర్ణయం తీసుకుంటే.. ఇతర సంస్థలు సైతం అదే మార్గంలో నడవొచ్చు' అని అతడు అభిప్రాయపడ్డట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బంగ్లాదేశ్‌లో కొంతకాలంగా రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో హిందువులపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ (IPL) మినీ వేలంలో కేకేఆర్ రూ.9.20 కోట్లకు తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో అతడిని రిలీజ్ చేయాలని బీసీసీఐ (BCCI).. కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేకేఆర్ ఫ్రాంచైజీ ముస్తాఫిజుర్‌ను విడుదల చేసింది. ఈ సంఘటన తర్వాత బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే భద్రత కారణాల దృష్ట్యా తమ క్రికెట్ జట్టు టీ20 వరల్డ్ కప్ (ICC Mens T20 World Cup) 2026 భారత్‌లో ఆడబోదని బీసీబీ.. ఐసీసీకి (ICC) లేఖ రాసింది. తమ మ్యాచ్‌లను మరోచోట నిర్వహించాలని అందులో పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే దీనిపై ఐసీసీ ఇంతవరకు అధికారికంగా స్పందించలేదు.

# మహిళల ప్రిమియర్ లీగ్.. ఉత్కంఠభరిత తొలి మ్యాచ్‌లో బెంగళూరు ఘనవిజయం



బెంగళూరు విజయానికి చివరి ఓవర్లో 18 పరుగులు అవసరం. తొలి రెండు బంతులకు పరుగే ఇవ్వలేదు నాట్ సీవర్. మహిళల క్రికెట్లో 4 బంతుల్లో 18 పరుగులంటే గెలవడం కష్టమే. కానీ దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ నదైన్ డిక్లెర్క్.. ఆఖరి నాలుగు బంతుల్లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. వరుసగా 6, 4, 6, 4 బాదేసి మహిళల ప్రిమియర్ లీగ్ నాలుగో సీజన్ తొలి మ్యాచ్‌లో తన జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు అద్భుత విజయాన్నందించింది. బ్యాటుతో విధ్వంసక అర్ధశతకం సాధించిన ఆమె.. అంతకుముందు బంతితోనూ విజృంభించి నాలుగు వికెట్లు తీయడం విశేషం.

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ తొలి మ్యాచే అభిమానులకు బోలెడంత వినోదాన్ని పంచింది. శుక్రవారం చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఆర్సీబీ 3 వికెట్ల తేడాతో ముంబయిపై అనూహ్య విజయాన్నందుకుంది. ఆశల్లేని స్థితిలో నదైన్ డిక్లెర్క్ (63 నాటౌట్; 44 బంతుల్లో 7×4, 2×6) సంచలన ఇన్నింగ్స్ ఆడడంతో ఆర్సీబీ 3 వికెట్లు కోల్పోయి సరిగ్గా 20 ఓవర్లలో 155 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. ముంబయి బౌలర్లలో అమేలియా కెర్ (2/13), నికోలా కేరీ (2/35) రాణించారు. మొదట సజీవన్ సజన (45; 25 బంతుల్లో 7×4, 1×6), నికోలా కేరీ (40; 29 బంతుల్లో 4×4) మెరుపులతో ముంబయి 6 వికెట్లకు 154 పరుగులు చేసింది. నదైన్ (4/26) బౌలింగ్‌లోనూ అదరగొట్టింది. డబ్ల్యూపీఎల్‌లో ఆమెకిది రెండో మ్యాచ్ మాత్రమే.

**ఓటమి ఖాయమనుకుంటే..:** రెండు నెలల కిందట వన్డే ప్రపంచకప్‌లో విశాఖపట్నంలో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాకు ఓటమి ఖాయమనుకున్న మ్యాచ్‌లో నదైన్ డిక్లెర్క్ (84 నాటౌట్) ఎలా చెలరేగిపోయిందో తన జట్టును ఎలా గెలిపించిందో భారత అభిమానులకు గుర్తుండే ఉంటుంది. ఆ టోర్నీలో బంగ్లాదేశ్‌తో మరో మ్యాచ్‌లోనూ నదైన్ అలాంటి ఇన్నింగ్సే ఆడింది. ఇప్పుడు డబ్ల్యూపీఎల్‌లోనూ ఆర్సీబీకి ఓటమి తప్పదనుకున్న స్థితిలో ఆమె విధ్వంసక ఇన్నింగ్స్ ఆ జట్టుకు విజయాన్నందించింది. ఆమె బ్యాటింగ్‌కు వచ్చిన ఓవర్ పూర్తయ్యేసరికి ఆర్సీబీ స్కోరు 65/5. గ్రేస్ హారిస్ (25), స్మృతి మంధాన (18) జట్టుకు మెరుపు ఆరంభాన్నే ఇచ్చినప్పటికీ.. 25 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ పీకల్లోతు కష్టాల్లో పడింది. గొప్పగా బౌలింగ్ చేసిన అమేలియా.. ఎనిమిదో ఓవర్లో 2 పరుగులే ఇచ్చి రాధ యాదవ్ (1), రిచా ఘోష్ (6)లను ఔట్ చేయడంతో ఆర్సీబీ ఓటమి బాటలో సాగింది. అయితే అరుంధతి (20)తో కలిసి పోరాడిన నదైన్.. జట్టును పోటీలోకి తెచ్చింది. 16 ఓవర్లకు 117/5తో ఆర్సీబీ మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ తర్వాతి ఓవర్లో నికోలా కేరీ.. 4 పరుగులే ఇచ్చి అరుంధతి, శ్రేయాంక (1)లను ఔట్ చేయడంతో సమీకరణం కఠినంగా మారింది. తర్వాతి 2 ఓవర్లలో 16 పరుగులే రావడం, అనుభవజ్ఞురాలైన నాట్ సీవర్ చివరి ఓవర్‌ను రెండు వరుస డాట్స్‌తో మొదలుపెట్టడంతో ముంబయి గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ చివరి నాలుగు బంతులకు నదైన్ భారీ షాట్లు ఆడి ఆర్సీబీకి అనూహ్య విజయాన్నందించింది.

**మెరిసిన నికోలా, సజన:** మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయి ఇన్నింగ్స్‌ను పేలవంగా మొదలుపెట్టింది. డబ్ల్యూపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఇంగ్లాండ్ ఫాస్ట్‌బౌలర్ లారెన్ బెల్ అద్భుత బౌలింగ్‌తో ఆర్సీబీకి అదిరే ఆరంభాన్నిచ్చింది. దూకుడుగా ఆడే అమేలియా కెర్ బ్యాటింగ్ చేస్తుండగా తొలి ఓవర్‌ను లారెన్ మెయిడెన్ వేయడం విశేషం. లారెన్ వేసిన తర్వాతి ఓవర్లోనూ తడబాటు కొనసాగించిన అమేలియా (15 బంతుల్లో 4).. అరుంధతికి తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ప్రమాదకర నాట్ సీవర్ (4)ను నదైన్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయిపోయింది. అయితే మరో ఎండ్‌లో దూకుడుగా ఆడుతున్న కమలిని (32; 28 బంతుల్లో 5×4)కి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (20) తోడవడంతో ముంబయి 63/2తో పుంజుకుంది. ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో ఔటైపోవడంతో ముంబయికి మళ్లీ ఇబ్బందులు తప్పలేదు. పరుగుల వేగం కూడా పడిపోవడంతో 14 ఓవర్లకు 85/4తో నిలిచిన ముంబయి.. 130 పరుగులకు మించేలా కనిపించలేదు. కానీ క్రీజులో కుదురుకున్న నికోలా, సజన చివరి ఓవర్లలో చెలరేగిపోవడంతో స్కోరు అనూహ్యంగా 150 దాటింది. ఆ జట్టు ఇంకా ఎక్కువ స్కోరే చేయాల్సింది. కానీ నదైన్ చివరి ఓవర్లో 5 పరుగులే ఇచ్చి వీళ్లిద్దరినీ ఔట్ చేసింది.

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: అమేలియా (సి) అరుంధతి (బి) లారెన్ 4; కమలిని (బి) శ్రేయాంక 32; నాట్ సీవర్ (స్టంప్డ్) రిచా (బి) నదైన్ 4; హర్మన్‌ప్రీత్ (సి) రిచా (బి) నదైన్ 20; నికోలా (సి) హేమలత (బి) నదైన్ 40; సజన (సి) స్మృతి (బి) నదైన్ 45; అమన్‌జ్యోత్ నాటౌట్ 4; పూనమ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 154; వికెట్ల పతనం: 121, 235, 363, 467, 5149, 6154; బౌలింగ్: లారెన్ బెల్ 41141; లిన్సీ స్మిత్ 20230; అరుంధతి రెడ్డి 40370; నదైన్ డిక్లెర్క్ 40264; శ్రేయాంక పాటిల్ 40321; రాధ యాదవ్ 20210

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) షబ్నిమ్ (బి) నాట్ సీవర్ 25; స్మృతి మంధాన (సి) పూనమ్ (బి) షబ్నిమ్ 18; హేమలత ఎల్బీ (బి) అమన్‌జ్యోత్ 7; రిచా ఘోష్ (సి) నికోలా (బి) అమేలియా 6; రాధ యాదవ్ (బి) అమేలియా 1; నదైన్ నాటౌట్ 63; అరుంధతి (సి) అమేలియా (బి) నికోలా 20; శ్రేయాంక (బి) నికోలా 1; ప్రేమ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 157; వికెట్ల పతనం: 140, 247, 362, 463, 565, 6117, 7121; బౌలింగ్: నాట్ సీవర్ 40471; షబ్నిమ్ ఇస్మాయిల్ 40261; నికోలా కేరీ 40352; అమన్‌జ్యోత్ 30181; అమేలియా కెర్ 40132; సైకా ఇషాక్ 10130

# సెమీస్‌లో సింధు



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అకానె యామగుచి (జపాన్)తో శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ సింధు తొలి గేమ్‌ను 13 నిమిషాల్లో 21–11తో సొంతం చేసుకుంది. అనంతరం ప్రపంచ మూడో ర్యాంకర్ అకానె యామగుచి గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగింది. దాంతో సింధును విజేతగా ప్రకటించారు. ఈ గెలుపుతో ముఖాముఖి రికార్డులో యామగుచిపై సింధు ఆధిక్యం 15–12కు పెరిగింది. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా)తో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 3–2తో ఆధిక్యంలో ఉంది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 10–21, 21–23తో ఫజర్ అల్ఫియాన్–షోహిబుల్ ఫిక్రీ (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాత్విక్–చిరాగ్‌లకు 9,062 డాలర్ల (రూ. 8 లక్షల 17 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.